జూన్ 15 లోపు వడ్లు కొనకపోతే..
బీజేపీ నేతల ఇండ్లముందు పోస్తం



హైదరాబాద్ పెన్ పవర్: రైతుల ధాన్యం కొనుగోళ్లపై కేంద్ర వైఖరిని తప్పుబట్టారు సీఎం రేవంత్ రెడ్డి. ధాన్యానికి మద్దతు ధర ప్రకటించిన కేంద్రమే వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 15 లోపు వడ్లు కొనకపోతే... బీజేపీ నేతల ఇళ్ల ముందే వడ్ల కుప్పలు పోస్తామని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డిస్కంలను అప్పుల కుప్పగా మార్చిందని... కానీ తమ ప్రభుత్వం రైతు డిస్కం ద్వారా ప్రజలకు మేలు చేస్తోందన్నారు. ఉచిత కరెంట్‌పై కాంగ్రెస్ పార్టీదే పేటెంట్ హక్కు అని, రైతులకు 24 గంటల కరెంట్ ఇచ్చి తీరుతామని, ఆపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ అక్రమాలు, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ప్రాథమిక ఆధారాలతో కేసులను

-4 లో

పత్రికా సమావేశంలో డీసీపీ కోటిరెడ్డి..

వాకింగ్‌కు వెళ్ళే మహిళలే టార్గెట్..!
చైన్ స్నాచింగ్ గ్యాంగ్ అరెస్ట్..



- జీడిమెట్లలో చైన్ స్నాచింగ్ కేసు ఛేదన.. పోలీసుల అదుపులో నిందితులు..
- 2 తులాల బంగారు గొలుసు, మొబైల్ రికవరీ..! దొంగిలించిన బైక్, ఆటో స్వాధీనం.
- రూ.5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం పరుచుకున్న పోలీసులు..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మే 30: హైదరాబాద్ జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 26న జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు ఛేదించి నిందితులను అరెస్టు చేశారు.. ఉదయం వేళల్లో వాకింగ్‌కు వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లు, దోపిడీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను జీడిమెట్ల పోలీసులు, సీసీఎస్ కుత్బుల్లాపూర్ బృందం సంయుక్తంగా అదుపులోకి తీసుకుంది.. పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 26వ తేదీన జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం సమీపంలో ఉదయం వాకింగ్ చేస్తున్న శ్రీలత అనే మహిళ మెడలోని రెండు తులాల బంగారు గొలుసుతో పాటు ఆమె మొబైల్ ఫోన్‌ను దుండగులు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించారు. దర్యాప్తులో భాగంగా నిందితులు ముందుగా ఎల్లమ్మబండ ప్రాంతంలో ఓ బైక్‌ను దొంగిలించి, అనంతరం మరో ఆటోను అపహరించినట్లు తేలింది. ఆ వాహనాలను ఉపయోగించి ఘటనాస్థలానికి చేరుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.. నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు తులాల బంగారు గొలుసు, బాధితురాలి మొబైల్ ఫోన్, నేరానికి ఉపయోగించిన బైక్, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు.. అరెస్ట్ అయిన వారిలో గోవింద్ సింగ్ (24), కరణ్ సింగ్ (21), హర్ధిప్ సింగ్ (19) పాత నేరస్తులుగా గుర్తించగా, మరో నిందితుడు మైనర్‌గా ఉన్నట్లు వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు కుత్బుల్లాపూర్ డీసీపీ కోటిరెడ్డి తెలిపారు.. పోలీసుల చాకచక్యంగా దర్యాప్తు చేపట్టి, సీసీటీవీ ఆధారాల విశ్లేషణతో కేసును తక్కువ సమయంలోనే ఛేదించడం గమనార్హమని డిసిపి కోటిరెడ్డి ప్రశంసించారు.



కార్పొరేట్ తరహాలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు



హైదరాబాద్ పెన్ పవర్: పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల్లోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల

-4 లో

01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసిఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

'ఐదు రోజులకు'

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి'

93948 55244

షరతులు వర్తిస్తాయి



బీఆర్ఎస్ నేత వారాల వినోద్, డిఎఫ్ఓ వేణు మాధవ్‌కు వినతిపత్రం అందజేసిన చిత్రం..

నాలా సమస్య పరిష్కారానికి..
నడుం బిగించిన బీఆర్ఎస్ నేత..

- దయానంద్ నగర్, రాజులస్వామి నగర్ నాలా సమస్యపై విజ్ఞప్తి..
- డిఎఫ్‌వో, ఎఫ్ఆర్ఓ, ఎఫ్ఎస్ఓ లను కలిసి అనుమతులు కోరిన నేతలు..
- సమస్య తీవ్రతను వివరించిన బీఆర్ఎస్ నేత వారాల వినోద్ కుమార్ బృందం..
- త్వరలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చిన అధికారులు..

అటవీశాఖ అనుమతుల కోసం బీఆర్ఎస్ నాయకుల వినతిపత్రం..!



నాలా సమస్యను అటవీశాఖ అధికారులకు వివరిస్తున్న వారాల వినోద్ కుమార్..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మే 30: సూరారం కాలనీలో నాలా సమస్య స్థానికులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోందని,ఈ సమస్య పరిష్కారానికి అటవీశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమ నాయకుడు వారాల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో అటవీశాఖ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.. సూరారం కాలనీ పరిధిలోని దయానంద్ నగర్, రాజులస్వామి నగర్ ప్రాంతాల్లో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న నాలా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.. ఈ సందర్భంగా అటవీశాఖ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డిఎఫ్ఓ) వేణుమాధవ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) లక్ష్మణ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (ఎఫ్ఎస్ఓ) ప్రవీణ్‌ని కలిసి సమస్య తీవ్రతను వివరించారు.. నాలా నిర్మాణ పనులు చేపట్టేందుకు అటవీ ప్రాంతం గుండా అనుమతులు మంజూరు చేయాల్సిన అవసరాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించారు.. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరంగా విన్న అటవీశాఖ అధికారులు సమస్యపై సానుకూలంగా స్పందించారని బీఆర్ఎస్ నేత వారాల వినోద్ కుమార్ పేర్కొన్నారు.. అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసి, త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, కావలి రవి, మైసా గౌడ్, వేణు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు మధ్యలో కట్ట నిర్మించి..
రూ.5,500 కోట్ల భూకబ్జా కుట్రను భగ్నం చేసిన హైడ్రా



- హైదరాబాద్ శివారులోని ముష్కిన్ చెరువు కబ్జా యత్నం భగ్నం
- చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టను కూల్చివేసిన హైడ్రా
- రెండు నెలల నోటీసు తర్వాత రంగంలోకి దిగిన అధికారులు
- చెరువు సరిహద్దులకు కంచె వేసి పరిరక్షణ చర్యలు ప్రారంభం

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ శివారు ప్రాంతంలో భారీ భూకబ్జా యత్నాన్ని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) అధికారులు భగ్నం చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలోని పుప్పాలగూడ, నార్సింగి సమీపంలో ఉన్న ముష్కిన్ చెరువును ఆక్రమించుకునేందుకు కొందరు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. సుమారు రూ.5,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు.వివరాల్లోకి వెళితే, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముష్కిన్ చెరువుపై కన్నేశారు. పేదలతో గుడిసెలు వేయించి, భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. గ్రామ రికార్డుల ప్రకారం 59.11 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు మధ్యలో ఏకంగా మట్టితో కట్ట నిర్మించి, 34 ఎకరాలకు పైగా భూమిని కబ్జా చేసేందుకు ప్లాన్ చేశారు.ఈ విషయంపై దృష్టి సారించిన హైడ్రా అధికారులు, ఆక్రమణదారులకు రెండు నెలల క్రితమే నోటీసులు జారీ చేశారు. అయినా వారు ఖాళీ చేయకపోవడంతో శనివారం చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టను, గుడిసెలను పూర్తిగా తొలగించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చెరువు సరిహద్దుల వెంబడి ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులను ప్రారంభించారు. నగరంలోని చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

చదువే ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం

హైదరాబాద్ పెన్ పవర్:

కొంగరకలాన్లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో మహిళా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్, “అమ్మకు అక్షరమాల” కార్యక్రమం, అంగన్వాడీ యూనిఫార్ముల పంపిణీ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, “ప్రపంచాన్ని, జీవితాన్ని మార్చే శక్తి చదువుతోనే సాధ్యమవుతుంది. ఒకవేళ జీవితంలో అన్నీ కోల్పోయినా చదువు ఉంటే మళ్లీ నిలబడగలుగుతాం” అని పేర్కొన్నారు. బాలికలు కార్పొరేటర్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కావాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నెల్సన్ మండేలా చెప్పిన ప్రపంచాన్ని మార్చి శక్తి విద్యకు ఉంది అనే సూక్తిని ప్రస్తావించిన మంత్రి, చదువుతో పాటు సంస్కారం కూడా జీవితంలో అంతే ముఖ్యమని తెలిపారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించడం, సమాజంతో మమేకం కావడం, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడం అవసరమని సూచించారు.

స్నేహ సంఘాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది టీనేజీ బాలికలను పదివేలకు పైగా స్నేహ గ్రూపులుగా ఏర్పాటుచేసి భద్రత, ఆరోగ్యం, పోషకాహారం, విద్య, సాధికారత అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా వాటిని విద్య, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. “పెళ్లి అయినా, వృద్ధాప్యం వచ్చినా మీతో ఉండేది మీ చదువు, మీ విజ్ఞానం మాత్రమే” అని పేర్కొంటూ ప్రతి బాలిక ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా కృషి చేయాలని కోరారు. అంగన్వాడీ యూనిఫార్ముల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ, తెలంగాణకు ఐసిడిఎస్ సేవల బీజం మహబూబ్నగర్ నుంచే పడిందని గుర్తు చేశారు. 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ చిన్నారుల కు పోషకాహారాన్ని అందించే విధంగా ఐసిడిఎస్ సేవలను ప్రారంభించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అంగన్వాడీ సేవలను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతోందన్నారు. గర్భధారణ దశ నుంచి మూడేళ్ల వయస్సు వరకు పిల్లల పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గతంలో లేని యూనిఫార్ములను ప్రస్తుతం



అందిస్తున్నామని, 57 రకాల విద్యా, ఆట వస్తువులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. “తొలి ముద్ద” కార్యక్రమం ద్వారా అల్పాహారం, పాలు, గుడ్లు, పోషకాహారం అందిస్తున్నామని వివరించారు.

“ప్రైవేట్ నర్సరీల్లో అన్నం, పాలు, గుడ్లు ఇవ్వరు. కానీ ప్రభుత్వ అంగన్వాడీల్లో పిల్లల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రయివేటు బడి వద్దు.. అంగన్వాడి ముద్దు” అని మంత్రి పేర్కొన్నారు. అంగన్వాడీ విద్య పూర్తి చేసుకుని మొదటి తరగతిలో చేరుతున్న చిన్నారులకు విద్యారంభ ధ్రువపత్రాలను మంత్రి అందజేశారు. స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్లో బాలికలు విద్య, ఆరోగ్యం, సైబర్ భద్రత, రవాణా, పాఠశాల మౌలిక వసతులు, మహిళా ఉపాధ్యాయుల నియామకం, సానిటరీ న్యాప్కిన్ల పంపిణీ తదితర అంశాలపై ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వ పథకాలపై సంబంధిత అధికారులు సమాధానాలు ఇచ్చారు.

ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూడా సీతక్క అసెంబ్లీలో చేసిన చర్చలు అధికారులను ఆలోచింపజేసేవని గుర్తుచేశారు. గ్రామస్థాయిలో బాలికలు తమ సమస్యలను ధైర్యంగా వ్యక్తపరిచే వేదికగా స్నేహ సంఘాలు నిలుస్తున్నాయని తెలిపారు.

మహిళల అక్షరాస్యత పెంపు కోసం చేపట్టిన “అమ్మకు అక్షరమాల” కార్యక్రమం ద్వారా లక్షలాది మంది మహిళలు చదవడం, రాయడం నేర్చుకుని వేలిముద్రకు బదులుగా సంతకం చేసే స్థాయికి చేరుకున్నారని అధికారులు వెల్లడించారు.

కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,మహిళా కమిషన్ సభ్యురాలు సదాలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, శాఖ డైరెక్టర్ శృతి ఓజా, పంచాయతీరాజ్ కమిషనర్ మరియు సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అధికారులు, స్నేహ సంఘాల సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు

జూన్ 15 లోపు వడ్లు కొనకపోతే..
బీజేపీ నేతల ఇండ్లముందు పోస్తం

-3 పేజీ తరువాయి

సీబీఐకి అప్పగించామని... దీనిపై బీజేపీ నేత కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని రేవంత్ డిమాండ్ చేశారు.హరీశ్ రావు ఎవరెవరితో సంప్రదింపులు జరుపుతున్నారో, ఎవరెవరితో మాట్లాడుతున్నారో తన దగ్గర పూర్తి సమాచారం ఉందన్నారు సీఎం. వచ్చే ఎన్నికల నాటికి హరీశ్ ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదని... ఒకవేళ బీఆర్ఎస్లోనే ఉంటాననే నమ్మకం ఉంటే, కేసీఆర్ మీద ఒట్టు వేసి చెప్పాలని సవాల్ విసిరారు. అంతేకాదు, వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసే పోటీ చేస్తాయని చెప్పారు.

2034 వరకు తాను తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటానని సీఎం స్పష్టం చేశారు. ప్రజలకు మేలు చేయడమే తన ఏకైక లక్ష్యమన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్, సీఎంగా తాను... ఒక సక్సెస్ఫుల్ కాంబినేషన్ అని, ఈ జోడీ ఇప్పటికే మంచి ఫలితాలను ఇచ్చిందని గుర్తు చేశారు. ఇదే విజయవంతమైన కాంబినేషన్తో వచ్చే ఎన్నికల్లోనూ గెలిచి తీరుతామని... 2029లోనూ తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

కార్పొరేట్ తరహాలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

-3 పేజీ తరువాయి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్ల నిర్మాణం ఏడాదిలోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మలి విడతలో మరో లక్ష ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపడతామని వెల్లడించారు. ప్రతి నియోజకవర్గాన్ని యూనిట్గా తీసుకొని.. అక్కడే ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. హైదరాబాద్ బంజారాహిల్స్లో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి శనివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే తదితర శాఖలు ఒకేచోట అందుబాటులో ఉండేలా సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామన్నారు. నగరంలోని మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తెస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వంపై నిధుల భారం పడకుండా స్థిరాస్తి నిర్మాణ రంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు ఈ భవనాల నిర్మాణ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు తెలిపారు. బంజారాహిల్స్లో 30 వేల చదరపు అడుగుల్లో నిర్మించే భవనాన్ని ఫీనిక్స్ సంస్థ పూర్తిచేసి ఇస్తుందన్నారు. ఈ సమీకృత భవనంలో ఎస్సార్ నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, డీఐజీ కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్- గోల్కొండ కార్యాలయాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీ అనిల్కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్యాదవ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కాంగ్రెస్ నేత విజయారెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చిన్న కాంట్రాక్టర్లకి ఇచ్చిన నిధులు, టెండర్లపై శ్వేతపత్రం కోసం డిమాండ్

హైదరాబాద్ పెన్ పవర్:

ఇందిరాపార్కు వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (జీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలు, 420 హామీలతో మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్.. అధికారం లోకి వచ్చాక అన్ని వర్గాలను నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు.

కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు ఇస్తామని దగా చేసిన కాంగ్రెస్ ఎన్నికల ముందు చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్ల పేరుతో ప్రభుత్వ కాంట్రాక్టులలో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం, బీసీలకు 42 శాతం (మొత్తం 72 శాతం) రిజర్వేషన్లు ఇస్తామని నమ్మబలికారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ అధికారం లోకి వచ్చాక 72 శాతం కాదు గదా, 72 పైసలు కూడా ఈ వర్గాలకు ఇవ్వకుండా అడ్డగోలు జీవోలను తెచ్చారని మండిపడ్డారు. చివరికి గురుకుల పాఠశాలల్లో స్థానిక చిన్న కాంట్రాక్టర్లు సరఫరా చేసే కూరగాయలు, చికెన్, పాలు, బ్రెడ్ వంటి వాటిని కూడా దక్కకుండా చేస్తూ ‘జీవో నెం.17’ (GO 17) తీసుకువచ్చి, ఆ టెండర్లను పెద్ద కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. చిన్న కాంట్రాక్టర్లను రోడ్లపైకి తెచ్చిన ఈ జీవో 17 రద్దయ్యే వరకు, బడుగు బలహీన వర్గాలకు కాంట్రాక్టులు దక్కే వరకు పోరాటం ఆపేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

చిన్న కాంట్రాక్టర్లకి ఇచ్చిన నిధులు, టెండర్లపై శ్వేతపత్రం కోసం డిమాండ్

ఇవాళ రాష్ట్రంలో కాంట్రాక్టులు కేవలం ఇద్దరికే దక్కుతున్నాయని, రేవంత్ రెడ్డి బామ్మర్దికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకుకే అన్ని కాంట్రాక్టులు ఇస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సొంత నియోజకవర్గం కొడంగల్ – నారాయణ పేట ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రూ.4 వేల కోట్ల కాంట్రాక్టును తన అనుయాయులకే ఇచ్చుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో కేవలం వాళ్ల బంధువులకే కాకుండా, బీజేపీ ఎంపీ సీఎం రమేష్కు రూ.1300 కోట్ల కాంట్రాక్టులు ఇస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్ల అప్పు చేశారని, అందులో రూ.4 అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాంట్రాక్టర్లకు ఇచ్చారా అని ప్రశ్నించారు. చిన్న కాంట్రాక్టర్లకు విడుదల చేసిన నిధులు మరియు చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము రేవంత్ సర్కార్కు ఉందా అని కేటీఆర్



డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డి ఒక ‘రెన్యూవల్ సీఎం’ మాత్రమే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేమెంట్ కోటాలో గద్దెనెక్కారని, ఆయన ఒక రెగ్యులర్ సీఎం కాదని, కేవలం ‘రెన్యూవల్ సీఎం’ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఢిల్లీ కాంగ్రెస్ హైకమాండ్కు నెలనెలా కప్పం (డబ్బులు) పంపి తన కుర్చీని కాపాడుకుంటున్నారని, ఢిల్లీకి బ్యాగులు మోసుకుంటూ పోయినన్ని రోజులు మాత్రమే ఆయన ఉద్యోగం ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణా బడుగులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా ఢిల్లీ హైకమాండ్ మౌనంగా ఉండటానికి ఇదే కారణమన్నారు. ఈ ద్రోహానికి రేవంత్ రెడ్డితో పాటు రాహుల్ గాంధీని, మల్లికార్జున ఖర్గేని కూడా నిలదీయాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ హయాంలో సంపద సృష్టి – అద్భుత ప్రగతి

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ‘సంపద సృష్టించాలి–పేదలకు పంచాలి’ అనే దృక్పథంతో పనిచేశారన్నారు. నాడు చిన్న చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుని గౌరవంగా నిలబెట్టారని గుర్తు చేశారు. కేసీఆర్ అప్పులు చేసి 1000కి పైగా గురుకులాలు కట్టించి, 6.50 లక్షల మంది బడుగు విద్యార్థులకు ఒక్కొక్కరిపై రూ.1.20 లక్షల నుండి రూ.1.25 లక్షల వరకు ఖర్చు పెట్టి కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య, బూట్లు, బట్టలు, నాణ్యమైన భోజనం అందించారని పేర్కొన్నారు. అప్పులతోనే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, జిల్లాకో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ తెచ్చారని, 24 గంటల కరెంట్, కేసీఆర్ కిట్, 15 లక్షల మంది ఆడబిడ్డలకు మేనమామ కట్నంగా కల్యాణలక్ష్మి కింద ఆర్థిక సాయం అందించారని తెలిపారు. రైతులకు రూ.72 వేల కోట్ల రైతుబంధు సాయాన్ని నేరుగా ఖాతాల్లో వేశారని గుర్తు చేశారు. ముఖం బాగాలేక అద్దం పగులగొట్టుకున్న చందంగా.. తాము చేతగాక కేసీఆర్ అప్పులు చేశాడని రేవంత్ రెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు. హద్దుమీరి మాట్లాడితే ఊరుకునేది లేదని, “తెలంగాణ తెచ్చిన మగోడు, మొనగాడు కేసీఆర్” అని కేటీఆర్ గర్వంగా ప్రకటించారు. 2028లో మన ప్రభుత్వమే వస్తుంది – 50 వేల మందిని కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దుతాం

రాష్ట్రంలో మక్కలు, వడ్లు కొనుగోలు కాక రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇవాళ ఏ ఒక్క ఊరికైనా కాంగ్రెస్ వాళ్లు వెళ్లే ధైర్యం ఉందా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎలక్షన్లు ఎప్పుడు వస్తాయా, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రుకాల్చి వాతపెట్టి, బొంద పెట్టాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. మైనర్ బాలికకు అన్యాయం జరిగితే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు వదిలిపెట్టకుండా ఎట్లా పోరాడారో, బడుగుల సమస్యలపై కూడా అలాగే పోరాడతామన్నారు. బడుగు వర్గాల సమస్యలపై అధికారులకు, మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఒకవేళ వాళ్ళు వినకపోతే భవిష్యత్తులో జంతర్ మంతర్ లేదా ఢిల్లీ వేదికగానైనా పోరాడుతామన్నారు. 2028లో తప్పకుండా మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, నాడు 10 వేల మంది కాదు, దాదాపు 50 వేల మంది బడుగు, బలహీన వర్గాల యువకులను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దే బాధ్యతను కేసీఆర్ తీసుకుంటారని కేటీఆర్ అభయమిచ్చారు

గవర్నర్ ను కలిసిన మండలి విపక్షనేత మధుసూధన చారి

హైదరాబాద్ పెన్ పవర్:

లోక్ భవన్ లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ నేతలు మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి మరియు సహకార సంఘాల చైర్మన్లు కలిసారు. సింగిల్ విండో చైర్మన్లను కొనసాగించాలని గవర్నర్కు విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా మధుసూదనా చారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా సహకార సంఘాల్లో నామినేటెడ్ వ్యక్తులను నియమించాలని చూస్తోంది. ఇది సహకార సంఘాల చట్టానికి విరుద్ధం 2020లో గెలిచిన చైర్మన్ల పదవీకాలం 2025 వరకు ఉంది. ఎన్నికలు జరపకుండా తమకు అనుకూలంగా ఉన్న వారిని నామినేట్ చేయాలని చూస్తోందని అన్నారు.

ఈ అంశంపై గవర్నర్కు వినతి పత్రం అందజేశాం. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరాం . ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా, లీగల్ ఒపీనియన్ తీసుకున్న తర్వాతే ముందుకు వెళ్తామని గవర్నర్ హామీ ఇచ్చారని అన్నారు.

నిప్పుల కొలిమిలా తెలంగాణ

హైదరాబాద్ పెన్ పవర్:

తెలంగాణ రాష్ట్రంలో ఎండ తీవ్రత పీక్ స్టేజ్కు చేరింది. పది జిల్లాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండగా.. వడదెబ్బ కారణంగా శుక్రవారం ఒక్కరోజే వివిధ జిల్లాల్లో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని 46 మండలాల్లో తీవ్రమైన వడగాలులు వీస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు ఈ వడగాలుల తీవ్రత కొనసాగుతుందని.. అయితే ఆదివారం నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 1వ తేదీ తర్వాతే ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయని వెల్లడించింది.తెలంగాణ రాష్ట్రంలో భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. వేసవి తీవ్రత రోజురోజుకూ ఎక్కువవుతుండటంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. రాష్ట్రంలోని దాదాపు పది జిల్లాల్లో ఎండలు దారెత్తిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి దూసుకుపోతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. శుక్రవారం నమోదైన గణాంకాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ ప్లానింగ్ సొసైటీ అందించిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రాంతాల్లో 46.2 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి.రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్లో 45.6 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ధర్మపురిలో 45.4 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా మునగాలలో 45.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్, ములుగు జిల్లా వెంకటాపూర్, వరంగల్ జిల్లా సంగెం ప్రాంతాలలో సైతం రికార్డు స్థాయిలో 45.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ భారీ ఉష్ణోగ్రతలకు తోడు తీవ్రమైన వడగాలులు తోడవడంతో రోడ్లన్నీ మధ్యాహ్నం వేళ జనసంచారం లేక కర్ఫ్యూను తలపిస్తున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది జిల్లాల్లోని సుమారు 46 మండలాల్లో వడగాలులు తీవ్ర ప్రభావం చూపించాయి. అత్యధికంగా మంచిర్యాల జిల్లాలోని 9 మండలాల్లో వడగాలులు వీయగా.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 8 మండలాలు, పెద్దపల్లిలో 7, నిర్మల్లో 6, జగిత్యాలలో 5 మండలాల్లో తీవ్రమైన వేడి గాలులు జనాన్ని అల్లాడించాయి. వీటితో పాటు ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో చెరో 3 మండలాల్లో, ములుగు జిల్లాలోని 2 మండలాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. శనివారం కూడా ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రత్యేకంగా హెచ్చరికలు జారీ చేసింది.మరోవైపు, ఈ తీవ్రమైన ఎండల కారణంగా రాష్ట్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఉష్ణోగ్రతల తట్టుకోలేక, వడదెబ్బ తగిలి శుక్రవారం ఒక్కరోజే వివిధ జిల్లాల్లో తొమ్మిది మంది మృతి చెందారు. ప్రజలకు ఉపశమనం కలిగించేలా వాతావరణ శాఖ ఒక సానుకూల వార్తను కూడా అందించింది. రాబోయే ఒకటి రెండు రోజుల పాటు తీవ్రమైన వడగాలుల పరిస్థితులు ఉంటాయని హెచ్చరించినప్పటికీ ఆదివారం నుంచి వాతావరణంలో మార్పులు వస్తాయని పేర్కొంది. ఆదివారం ఉత్తర, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. దీనివల్ల వచ్చే నెల ఒకటో తేదీ తర్వాత నుంచి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పడతాయని అప్పటివరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని అధికారులు సూచించారు.

నిమ్స్‌లో ఫైర్ మాక్ ఓడిల్

హైదరాబాద్ పెన్ పవర్: ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం సందర్భంగా నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ట్రామా బ్లాక్‌లో శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది.హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం మరియు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో, హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులైన జిల్లా ఫైర్ ఆఫీసర్ టి. వెంకట్, అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ వి. భానుప్రసాద్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం.డి. షౌకత్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి. సాయి రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించబడింది.అగ్నిప్రమాదం సంభవించిన సందర్భంలో ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది, భద్రతా సిబ్బంది ఎలా స్పందించాలి, రోగులను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలి, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై ఈ మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించడం జరిగిందని, రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా డమ్మీ పేషెంట్ల సహాయంతో డ్రిల్ నిర్వహించినట్లు నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు.

ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం హెచ్. ఓ. డి డా.సునీల్ , ట్రామా బ్లాక్‌లోని వివిధ విభాగాల సిబ్బంది, నర్సింగ్ అధికారులు, టెక్నీషియన్లు, శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది ఈ మాక్ డ్రిల్ లో పాల్గొన్నారు.



02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్ కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

కొట్యా తండా లో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

మహబూబాబాద్: పెన్ పవర్: జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మరిపెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొట్యా తండా గ్రామానికి చెందిన చావుల్లా తండా, జాలి తండా, అర్లగడ్డ తండాలలో ఈ రోజు కమ్యూనిటీ కాంటాక్ట్ మరియు ఏరియా డామినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు ఇంటింటి తనిఖీలు చేపట్టి సుమారు 100 ఇళ్లు పరిశీలించారు.

తనిఖీల్లో రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్లు, పత్రాలు లేని 10 వాహనాలను గుర్తించి విచారణకు తీసుకున్నారు. అలాగే 400 కిలోల నల్ల బెల్లం, 50 లీటర్ల గుడుంబా, 50 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల బెల్లం పులుసును గుర్తించి ధ్వంసం చేశారు.

అనంతరం గ్రామస్తులతో అవగాహన సమావేశం నిర్వహించి చోరీలు, రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, సైబర్ నేరాలు, గంజాయి నివారణ, సీసీ కెమెరాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 25 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

హైదరాబాద్‌లో మహిళను వేధించిన యువకులకు షాక్

అబిడ్స్ పోలీసుల స్పీడ్ యాక్షన్‌తో 48 గంటల్లోనే జైలు శిక్ష

హైదరాబాద్ పెన్ పవర్:



నిజాం కాలేజ్ దగ్గర డ్రంకెన్ కండిషన్‌లో మహిళను వేధించిన ఐదుగురు అరెస్ట్

కోర్టు ఒక్కొక్కరికి 7 రోజుల జైలు శిక్ష విధించింది. మహిళల భద్రతపై కఠినంగా వ్యవహరిస్తామన్న హైదరాబాద్ పోలీసులు శిక్ష పడిన నిందితుల వివరాలు:

అందరూ కేటరింగ్ కార్మికులు, నేపాల్ దేశస్థులు, ప్రస్తుతం నివాసం: కింగ్ కోఠి, హైదరాబాద్, సునీల్,ఉమేష్,లక్ష్మణ్,పురుషోత్త రామ్

మహిళను వేధించిన కేసులో ఈ ఐదుగురికి కోర్టు 7 రోజుల జైలు శిక్ష విధించింది.

ఎస్ఐ ఆర్ పైన అందరు అవగాహన పెంచుకోవడం సంతోషం...

హైదరాబాద్ పెన్ పవర్: ఎస్ఐఆర్ పైన అందరు అవగహన పెంచుకోవడం సంతోషం ఎస్ఐఆర్ వల్ల సామాన్యులు, పేదలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామం. ఎస్ఐఆర్ లంబాడీలు,ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావొచ్చు.కొన్ని నియోజకవర్గాల్లో చాలా మంది వలస పోయారు మహిళలకు కూడా ఎస్ఐఆర్ వల్ల సమస్యలు ఎదురుకావొచ్చు. ఎస్ఐఆర్ వల్ల దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే అవకాశం ఉంది

ఎస్ఐఆర్ వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారంపైన సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి.బూత్ ఎన్ రోలర్ సాయంతో గతంలో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్ షిప్ చేయించాంఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి రాహుల్ గాంధీ తో సన్మానం చేయించాం.గతంలో కాంగ్రెస్ సభ్యత్వంలో కీలక పాత్ర పోషించిన ఎన్ రోలర్స్ ను ఎస్ఐఆర్ విషయంలో పరిగణనలోకి తీసుకోవాలిడిజిటట్ మెంబర్ షిప్ కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంచార్జ్ ను నియమించి నిరంతరం పర్యవేక్షించాంఎస్ఐఆర్ కోసం 119 నియోజకవర్గాలు,17 లోక్ సభ నియోజకవర్గాలకు ఇంచార్జ్ ల నియమించాలి.అసెంబ్లీ ఇంచార్జ్ లు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందేఇంచార్జ్ లు కరెక్ట్ గా పనిచేస్తే ఒక్క ఓటు కూడా డిలీట్ కాకుండా చూడొచ్చు.ఇంచార్జ్ మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజు పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా పనిచేయాలి

క్షేత్ర స్థాయికి వెళ్లి కార్యకర్తలను ఇంచార్జ్ మంత్రులు కలవాలి.నేను కూడా 10 రోజులకోసారి క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తానునెలలో మూడు రోజులు పార్టీ కార్యకర్తల కోసం సమయం ఇస్తాపార్టీ కోసం పనిచేయాల్సిందే.మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు ప్రతి ఒక్కరు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందే,నాతో పాటు ఎవరికి మినహాయింపు ఇవ్వొద్దుమాజీ పీసీసీ అధ్యక్షుల సలహాలు,సూచనలు తీసుకోవాలి.)దాదాపు గా నామినేటేడ్ పోస్టులను భర్తీ చేశాంపార్టీ తరుపున ఇప్పుడు వేలాది మంది సర్పంచ్ లున్నారు,మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు ఉన్నారువలసలు పోయిన వారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడాలిపార్టీ నాయకులంతా సమన్వయం తో ముందుకు వెళ్లాలి.నాయకులు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారురాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో బాధ్యత అప్పగించాలి హైదరాబాద్ నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ పైన అసెంబ్లీల వారీగా సమావేశాలు పెట్టాలి. ఎస్ఐఆర్ పైన మహిళా కాంగ్రెస్ తరుపున క్లస్టర్ల వారీ గా సమావేశాలు నిర్వహించాలి.

ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

పాల్గొన్న మంత్రులు పొంగులేటి, పొన్నం, అజారుద్దీన్

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్--10లో ప్రజాప్రభుత్వం నిర్మించ తలపెట్టిన డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ ఆఫీస్ మరియు ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ , ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి శంకుస్థాపన చేయడం జరిగింది.

మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోపేదవారి గుమ్మం వద్దకే అనేక ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నాము. అందులో భాగంగా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడంలో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు స్టాంప్స్ ఁ రిజిస్ట్రేషన్, సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా హైదరాబాద్ ఇన్నర్ రింగ్ రోడ్డులోని మూడు కార్పొరేషన్లపరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు ఆఫీస్ లకు ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని అన్నారు.

ప్రభుత్వంపై ఎలాంటి నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రముఖ సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నాము. బంజారా హిల్స్ లో 30వేల చదరపు అడుగుల్లో నిర్మించే సమీకృత కార్యాలయ భవనాన్ని ఫినిక్స్ సంస్థ మరి కొద్ది నెలల్లో పూర్తి చేసి అందిచనుంది. ఈ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు, డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ - గోల్కొండ కార్యాలయాలు ఉంటాయి. వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని రెవెన్యూ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా ఎంతోమంది స్థానికులకి ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు తప్పకుండా కలుగుతాయి.

క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తాము. పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తాము, ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు కూడా చేపడతాము.పేదలకు పెద్దన్నగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప కానుక అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం చరిత్రలో నిలిచి పోతుందని అన్నారు..

బంజారా హిల్స్ లో నిర్మించే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణం వలన వందలాది సంవత్సరాలుగా నమాజ్ చేసుకుంటున్న ముస్లిం సోదరులకు భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించడం జరిగిందని అన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు అప్ గ్రేడ్ కావాలి

హైదరాబాద్ పెన్ పవర్:

సిద్దిపేటలో ఫోటోగ్రాఫర్ల కోసం ఏర్పాటు చేసిన వెడ్డింగ్ ఫోటోగ్రఫీ బిజినెస్ వర్క్ షాప్ కు మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు.

హరీష్ రావు మాట్లాడుతూ వంద మాటలు చెప్పలేని భావాన్ని, సారాంశాన్ని ఒక అద్భుతమైన ఫోటో చెబుతుంది. ఫోటోగ్రఫీకి సమాజంలో అంతటి గొప్ప విలువ ఉందని అన్నారు.

ప్రస్తుతం టెక్నాలజీ మారి ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు వచ్చాయి. ఫంక్షన్లలో అందరూ సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటున్నప్పటికీ.. ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ వృత్తికి ఉన్న డిమాండ్ ఎప్పటికీ తగ్గదు, దానికి ఎప్పుడూ మంచి భవిష్యత్తు ఉంటుంది. ఆర్టీఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి కొత్త టెక్నాలజీలు వస్తున్న తరుణంలో సాఫ్ట్వేర్ ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, రాజకీయ నాయకులు సైతం ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు కూడా తమ నైపుణ్యాలను అప్డేట్ చేసుకోవాలి, లేకపోతే వెనుకబడిపోతారు. మీ నైపుణ్యాలను పెంచేందుకు



ఏర్పాటు చేసిన ఈ వర్క్ షాప్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.సిద్దిపేటలోని కోమటి చెరువు, రంగనాయక సాగర్ వంటి సుందరమైన ప్రాంతాలు ఇప్పుడు ఫోటోషూట్లకు కేరాఫ్ అడ్రస్గా మారి, ఎప్పుడూ కళకళలాడుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో మార్కెట్లో డబ్బుల చెలామణి ఆగిపోయింది. రియల్ ఎస్టేట్ పడిపోవడంతో ప్రజల చేతుల్లో డబ్బు లేక శుభకార్యాల ఖర్చులు బాగా తగ్గించుకుంటున్నారు. దీనివల్ల ఫోటోగ్రాఫర్లకు వచ్చే గిరాకీ, ఆదాయం కూడా సగానికి పడిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఫోటోగ్రాఫర్లకు ప్రభుత్వ స్థలం ఇచ్చి, ప్రభుత్వ నిధులతో ప్రత్యేకంగా ఒక భవనం నిర్మించిన ఏకైక ప్రాంతం మన సిద్దిపేట మాత్రమే. ఆ భవనానికి సంబంధించి మిగిలి ఉన్న కొద్దిపాటి పనులను కూడా త్వరలో పూర్తి చేసి, పూర్తిగా వినియోగంలోకి తీసుకొస్తాము. ఫోటోగ్రాఫర్లకు ఉచిత ఓపీ సేవలు అందించే ఉద్దేశంతో హెల్త్ కార్డులు పంపిణీ చేయడం చాలా సంతోషకరం. ఈ కష్టకాలం పోయి ఫోటోగ్రాఫర్లకు మళ్లీ మంచి రోజులు రావాలని, వ్యాపారం బాగా జరిగి మీరంతా ఆర్థికంగా స్థిరపడాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తున్నానని అన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం: పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



కరీంనగర్: పెన్ పవర్: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా పోలీస్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధి నిర్వహణ చేపట్టాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, డిజిటల్ రికార్డుల నిర్వహణ మరియు క్షేత్రస్థాయి భద్రతా చర్యలపై శనివారం ఆయన ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ జారీ చేసిన ముఖ్యమైన ఆదేశాలు:నేపాలి మరియు ఇతర రాష్ట్రాల కార్మికుల గుర్తింపు వివరాల నమోదు తప్పనిసరి.

కరీంనగర్ పరిధిలో దాదాపు 1000 మంది వరకు నేపాలీలు వివిధ రంగాలలో పనిచేస్తున్నారని, ప్రస్తుతం వారిలో కేవలం 169 మంది వివరాలు మాత్రమే నమోదయ్యాయని సిపి తెలిపారు. ఇతర రాష్ట్రాలు మరియు దేశాల నుండి ఇక్కడికి వచ్చి కూలీలుగా, కార్మికులుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరి పూర్తి వివరాలను, వారి అధికారిక గుర్తింపు కార్డుల తో సహా సంబంధిత పోలీస్ స్టేషన్లలో రికార్డు చేయాలని ఆదేశించారు. యజమానులు సైతం తమ వద్ద పనిచేసే వలస కార్మికుల వివరాలను పోలీసులకు అందించాలని సూచించారు.

సీసీటీఎన్ఎస్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు డేటా అప్‌లోడ్: భవిష్యత్తులో కేసుల పరిశోధన, ట్రాకింగ్ మరియు రికార్డుల పరిశీలన అంతా పూర్తిగా సీసీటీఎన్ఎస్ పైనే ఆధారపడి ఉంటుందని సిపి స్పష్టం చేశారు.అందువల్ల, పోలీస్ స్టేషన్ లో నమోదయ్యే ప్రతి కేసు యొక్క పూర్తి వివరాలను నిర్ణీత గడువులోగా ఎలాంటి ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు.

రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై కఠిన నిఘా: సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులు, రౌడీ షీటర్లు మరియు హిస్టరీ షీటర్ల కదలికలపై స్థానిక పోలీసులు 24 గంటలూ నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. పాత నేరస్థుల ప్రవర్తనను నిశితంగా గమనిస్తూ, నగరంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

మాల్ఖానాల సమర్థవంతమైన నిర్వహణ: పోలీస్ స్టేషన్లలోని మాల్ఖానా కేసులకు సంబంధించిన స్వాధీనపరుచుకున్న సొత్తు వస్తువుల గది నిర్వహణ అత్యంత పారదర్శకంగా, క్రమపద్ధతిలో ఉండాలని సిపి స్పష్టం చేశారు.మాల్ఖానాలోని ప్రతి వస్తువు రికార్డులలో స్పష్టంగా నమోదు కావాలని, వాటి భద్రత విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో కమిషనరేట్ పరిధిలోని ఏసీపీ సిసిఆర్బీ శ్రీనివాస్ జి, ఇన్స్పెక్టర్ సరిలాల్, కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీకి చేరిన తెలంగాణ పంచాయితీ

హైదరాబాద్, మే 30, పెన్ పవర్:

కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిగిన ఎన్నికలలో కేవలం కేరళ రాష్ట్రంలో మాత్రమే అధికారంలోకి వచ్చింది. తమిళనాడు రాష్ట్రంలో అధికార పక్షంలో ఒక భాగమైంది. కీలకమైన పశ్చిమ బెంగాల్లో.. అస్సాంలో.. చిన్న రాష్ట్రమైన పుదుచ్చేరిలో అధికారాన్ని దక్కించుకోలేకపోయింది. కనీసం చెప్పుకునే స్థాయిలో శాసనసభ స్థానాలను దక్కించుకోలేకపోయింది .క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇప్పుడు వచ్చే వాళ్ళతో.. పోయే వాళ్లతో అత్యంత రద్దీగా ఉంది. రాహుల్ గాంధీ కూడా మల్లికార్జున కార్గే.. వేణుగోపాల్ రెడ్డి వంటి వారితో నిత్యం సమావేశాలు పెడుతున్నారు. ఏం జరిగి ఉంటుంది.. ఏం జరుగుతోంది అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నప్పుడే.. తెలంగాణ నేతలు అక్కడ కనిపిస్తున్నారు. కొద్దిరోజుల వరకు సాగిన కర్ణాటక పంచాయతీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావడంతో ముగిసింది. ఇప్పుడు మళ్లీ తెలంగాణ పంచాయతీ ప్రారంభమైంది. అలాగని తెలంగాణలో ముఖ్యమంత్రి మార్పు జరగడం లేదు. రేవంత్ రెడ్డి స్థానంలో కొత్త వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుకోవడం లేదు.కాకపోతే కొంతమంది మంత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు.. తమ శాఖలలో పిచ్చిపిచ్చి పనులు చేస్తున్నట్టు అధిష్టానానికి నివేదిక అందింది. ఇటీవల మీనాక్షి నటరాజన్ రాహుల్ గాంధీకి ఈ విషయాన్ని చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో అధిష్టానం కొన్ని శాఖలలో ప్రక్షాళన చేయాలని భావించినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ విషయం తెలిసిన కాంగ్రెస్ నాయకుడు వెంటనే ఢిల్లీ చేరుకున్నారు. మంత్రులుగా ప్రమోషన్ సాధించాలి అనుకునేవారు రాహుల్ గాంధీ ప్రాపకం కోసం పాకులాడుతున్నారు.వారిలో ఇప్పటికే గడ్డం ప్రసాద్ తనకు మంత్రి పదవి కేటాయించాలని రాహుల్ గాంధీకి వినతిపత్రం అందించిన తెలుస్తోంది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి.. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వంటి వారు తమకు మంత్రి పదవులు ఇవ్వాలని రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేసినట్టు తెలుస్తోంది. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ కూడా తనకు మంత్రి పదవి ఇవ్వాలని రాహుల్ గాంధీని కోరినట్లు తెలుస్తోంది. కొంతకాలంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. ముఖ్యమంత్రిపై నేరుగా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే విధంగా మాట్లాడుతున్నారు.మంత్రివర్గ ప్రక్షాళన జరుగుతుందని వార్తలు వస్తున్నా నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి రాహుల్ గాంధీ నివాసంలో గాని.. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాని కనిపించడం లేదు. ఇంతవరకు విజ్ఞప్తులు అందించినట్టు కూడా సమాచారం అందడం లేదు. అంటే మంత్రివర్గ విస్తరణ ఉంటుందా.. లేక మీడియాకు కాంగ్రెస్ పార్టీ లీకలు ఇస్తోందా.. అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై మరింత స్పష్టత రావాలంటే మరికొంత సమయం పడుతుందని పొలిటికల్ ఎక్స్పర్ట్స్ అంటున్నారు.

మంత్రుల మూగనోము..


తెలంగాణ కాంగ్రెస్ మంత్రుల్లో సఖ్యత లేదు. ఎవరి పని వారే చేసుకుంటున్నారు. ప్రత్యర్థి పార్టీలు చేసే విమర్శలకు సయితం కనీసం మంత్రులు స్పందించడం లేదు. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో ఇందరు మంత్రులు ఉన్నప్పటికీ ఇద్దరో, ముగ్గురో విపక్షాల విమర్శలకు స్పందిస్తున్నారు. అసలు బీఆర్ఎస్, బీజేపీలకు కౌంటర్ ఇచ్చే మంత్రి కేబినెట్ లో కనిపించడం లేదన్న విమర్శలు సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. ఏదైనా ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలే కాని, మంత్రులు ఎవరూ తమకు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా మంత్రుల తీరులో మార్పు లేదు. వారి మౌనం ఎందుకన్నది ఎవరకీ అర్థం కాకుండా ఉంది.తెలంగాణ సంస్కృతిఎక్కడైనా ప్రభుత్వంపై విమర్శలు చేస్తే వెంటనే మంత్రులు ధీటుగా సమాధానమిస్తారు.

కానీ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం విభిన్నమైన పరిస్థితి. ఎవరి శాఖ వారిదే. తమ శాఖపై వచ్చిన ఆరోపణలను మాత్రమే వారు ఖండిస్తున్నారు. అదీ తప్పనిసరి పరిస్థితుల్లో కౌంటర్ ఇస్తున్నారు. ధాన్యం సేకరణపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు విరుచుకుపడుతున్నప్పటికీ ఎవరూ స్పందించ లేదు. మరొకవైపు హరీశ్ రావు తాము అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామన్న వ్యాఖ్యలను కూడా శ్రీధర్ బాబు మినహా మరెవరూ ఖండించకపోవడాన్ని

ఈ సందర్భంగా పలువురు గుర్తు చేస్తున్నారు. మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడమే కారణమని అంటున్నారు.మరొకవైపు మంత్రుల్లో ఏదో తెలియని అసంతృప్తి కూడా ఉందన్న ప్రచారం పార్టీలో జరుగుతుంది. గాంధీ భవన్ కు వచ్చే మంత్రుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఉన్న మంత్రుల్లో ఒకరిద్దరు మాత్రమే యాక్టివ్ గా కనిపిస్తున్నారు. మిగిలిన వారు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కోమటిరెడ్డి వెంకరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ వంటి సీనియర్ నేతలు కూడా మూగనోము పట్టడం ఎందుకన్న ప్రశ్న ఇప్పుడు కాంగ్రెస్ నేతలను వేధిస్తుంది. మొత్తం మీద కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏదో జరుగుతుందన్న ప్రచారం మరింత ఊపందుకుంది. ప్రభుత్వంపై వచ్చే విమర్శలను సమిష్టిగా ఎదుర్కొని సరైన కౌంటర్ ఇవ్వాల్సిన మినిస్టర్లు మౌనం వహించడంపై చర్చ జరుగుతుంది.

నార్సింగిలో 'హైడ్రా' దూకుడు: ముషి్క చెరువు కబ్జాలపై ఉక్కుపాదం..

భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు, కంచె ఏర్పాటు



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ పరిధిలోని చెరువుల సంరక్షణే ధ్యేయంగా ఏర్పడిన హైడ్రా అధికారులు శనివారం ఉదయాన్నే నార్సింగి లో మరో భారీ ఆపరేషన్ చేపట్టారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి రంగంలోకి దిగిన హైడ్రా బృందాలు.. నార్సింగిలోని ప్రముఖ ముషి్క (ముషి్కన్) చెరువు పరిరక్షణ చర్యలను వేగవంతం చేశాయి.

10 ఎకరాలు కబ్జా.. రియల్ వ్యాపారుల చేతుల్లో చెరువు స్థలం!

మొత్తం 60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ముషి్క చెరువులో, సుమారు 10 ఎకరాల మేర చెరువు స్థలం కబ్జాకు గురైనట్లు హైడ్రా అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పలువురు బిల్డర్లు చెరువు పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించి పెద్ద ఎత్తున నిర్మాణాలకు పాల్పడినట్లు తేలింది.

రంగంలోకి జెసిబిలు.. 'స్కైలా' అపార్ట్మెంట్ కాంపౌండ్ వాల్ కూల్చివేత!

చెరువు ఎఫ్టీఎల్ (FTL), బఫర్ జోన్ పరిధిలో

అక్రమంగా నిర్మించిన కట్టడాలకు అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగానే, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ప్రసిద్ధ 'స్కైలా' (గ్రూఎఅశ్రీఱ) అపార్ట్మెంట్కు చెందిన కాంపౌండ్ వాల్ (రక్షణ గోడ)ను అధికారులు ఈరోజు ఉదయం జెసిబిల సహాయంతో నేలమట్టం చేశారు.50 ఎకరాలకు కంచె.. భారీ పోలీస్ బందోబస్తుఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరియు స్థానికులు, బిల్డర్ల నుంచి ప్రతిఘటన ఎదురుకాకుండా ఉండేందుకు పటిష్టమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. భారీగా పోలీస్ బలగాలను మోహరించి, వారి బందోబస్తు మధ్య ప్రస్తుతం ఆక్రమణల తొలగింపు ప్రక్రియను కొనసాగిస్తున్నారు. కబ్జాల బారిన పడకుండా మిగిలిన సుమారు 50 ఎకరాల చెరువు స్థలానికి చుట్టూ ఇరిగేషన్, హైడ్రా అధికారులు సంయుక్తంగా శాశ్వత కంచె (Fencing) ఏర్పాటు చేసే పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు.అధికారుల హెచ్చరిక: చెరువుల పరిరక్షణలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, ఎంతటి వారైనా సరే ఎఫ్టీఎల్, బఫర్ జోన్పరిధిలోని అక్రమ నిర్మాణాలను వదిలిపెట్టేది లేదని అధికారులు స్పష్టం చేశారు. చెరువు కానుకొని ఉన్న విల్లాలు, పెద్ద భవనాల్లోని తాత్కాలిక గుడిసెలను తక్షణమే ఖాళీ చేయాలని హెచ్చరించారు.

రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్ పెన్ పవర్:

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడారు.మార్పు పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలన పూర్తిచేసుకున్నా, తెలంగాణ రైతుల జీవితాల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదు. రైతాంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంలోనూ ఎలాంటి మార్పు కనిపించడం లేదు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోంది. రైతులసమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రభుత్వం, రైస్ మిల్లర్లు, అధికారులు, దళారీల మధ్య రైతులు నలిగిపోతున్నారు. రైతు ప్రయోజనాలు పక్కనపడి వ్యవస్థ మొత్తం ఇతర ప్రయోజనాల చుట్టూతిరుగుతోంది. న్ని వనరులు ఉన్నప్పటికీ, ప్రభుత్వ చేతగానితనం మరియు సరైన కార్యాచరణ ప్రణాళిక లేకపోవడం వల్ల పంట చేతికొచ్చిన సమయంలోనే రైతులు వర్షాల బారినపడి నష్టపోతున్నారు.బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు రైతుల గోస -- బీజేపీ భరోసా' యాత్ర చేపట్టే వరకు కూడా కాంగ్రెస్ మంత్రులు కార్యాలయాల్లోనే పరిమితమయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించకుండా కేవలం ప్రకటనలకే పరిమితమైందని అన్నారు.ధాన్యం కొనుగోళ్లు కేంద్ర ప్రభుత్వం చేయడం లేదని ముఖ్యమంత్రి, మంత్రులు విమర్శలు చేస్తున్నారు. అయితే ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణ, కొనుగోళ్లు, రైస్ మిల్లులకు తరలింపు వంటి బాధ్యతలు రాష్ట్ర

ప్రభుత్వ పరిధిలో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపాలి. మిల్లులు బియ్యంగా మార్చి ఎఫ్సీఐకి అందించాలి.ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి 52.24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్సీఐకి అందించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. అంటే దాదాపు 53 లక్షల మెట్రిక్ టన్నులధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేపట్టలేకపోయిందో సమాధానం చెప్పాలని అన్నారు.తమ బాధ్యతలను నిర్వర్తించకుండా కేంద్ర ప్రభుత్వంపై నెపం మోపడం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కేంద్రంపై మోపే ప్రయత్నం జరుగుతోంది. గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రైతులజీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. రైతుల భవిష్యత్తుపై ఎలాంటి ముందుచూపు చర్యలు కనిపించడం లేదని అన్నారు.తెలంగాణలో కొనుగోలు చేసిన నాణ్యమైన సన్నబియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించి, అక్కడి నుంచి తక్కువ నాణ్యత గల బియ్యాన్ని కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.తెలంగాణ రైతుల ఉత్పత్తికి సరైన విలువ దక్కడం లేదు. ఇతర రాష్ట్రాల్లో అధిక ధరలకు అమ్మే బియ్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేసి, రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారు.బీఆర్ఎస్ హయాం నుంచి ప్రారంభమైన ఈ విధానం ఇప్పటికీ కొనసాగుతోంది. కొత్త వంగడాల అభివృద్ధి, సరఫరా విషయంలో కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదు. అవసరానికి మించి ఉత్పత్తిజరుగుతున్నప్పటికీ మార్కెటింగ్ ప్రణాళికలు లేవని అన్నారు.ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాలి. రైతు సంఘాలతో చర్చలు జరపాలి. మండల, జిల్లా స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించాలని అయన సూచించారు.**హైదరాబాద్ పెన్ పవర్:**

సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమంలో పుణ్యస్నానం

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కాళేశ్వరం పెన్ పవర్: సరస్వతి నది అంత్య పుష్కరాల సందర్భంగా పవిత్ర గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీ నదుల త్రివేణి సంగమం వద్ద కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం సంగమ క్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని ఆ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని ప్రార్థించానని తెలిపారు.

111 జీవో ఎత్తివేస్తామని మీకు హామీ ఇస్తున్నా.

టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత శనివారం మొయినాబాద్ లో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరించారు. కవిత మాట్లాడుతూ మొయినాబాద్, చేవెళ్ల ప్రజలందరికీ నమస్కారం. తెలంగాణలోకొత్త రాజకీయ శక్తిగా మనం పుట్టుకొచ్చాం. తెలంగాణ వస్తే అన్ని సమస్యలు పోతాయనుకుంటే అది జరగలేదు. ఆ లక్ష్యాలను సాధించుకోని, తెలంగాణ హక్కులను తెలంగాణ రక్షణ సేన పరిరక్షిస్తుంది. ఈప్రాంతంలో చూస్తే ఎకరాకు వందకోట్ల రూపాయలు పలుకుతున్న పరిస్థితి మనం చూస్తున్నామని అన్నారు.ఐతే 120 గ్రామాలకు సంబంధించి 111 జీవోను ఎత్తివేస్తే ఇక్కడి రైతులకు మేలు జరుగుతుంది. పిల్లల పెళ్లిళ్ల కోసం ఒక పావు ఎకరం అమ్ముకున్న మంచి ధర వచ్చే పరిస్థితి ఉంటుంది. కానీ 111 జీవో

ఎత్తివేస్తామని అన్ని పార్టీల వారు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చాక పట్టించుకోవటం లేదు. తెలంగాణ రక్షణ సేన కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. మేము 111 జీవో ఎత్తివేస్తామని మీకు హామీఇస్తున్నా. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉంటారు. ఈ గుంపుమేస్త్రీ నాకు రియల్ ఎస్టేట్ వ్యాపారమే బాగా తెలుసు అని చెప్పాడు. కానీ ఆ వ్యాపారాన్ని కూడాఊడగొట్టిండు. అందుకే గుంపు మేస్త్రీ పై పోరాటం చేయాల్సి ఉంది. చేవెళ్ల, మెయినాబాద్ ప్రజలు ఈ ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధంగా ఉండాలి. మన పార్టీలోకి పెద్ద ఎత్తున మైనార్టీలు చేరారు. వాళ్ల చేరికతోమరింత బలపడ్డాం. ఇక్కడున్న గంగా, జమునా తెహజీబ్ సంస్కృతిని చెడగొట్టే వాళ్లకు సరైన బుద్ధి చెప్పాలి. తెలంగాణ వస్తే మన ఆడబిడ్డల జీవితాలు మారుతాయని అనుకున్నాం. కానీ అలా జరగలేదు.ఆడబిడ్డలకు కచ్చితంగా మంచి చేసేందుకు నేను పార్టీ పెట్టాను. ఒక ఆడబిడ్డ, మీ సోదరిగా నాకు మీ సమస్యలన్నీ తెలుసు. మన యువతకు కూడా ఉద్యోగాలు రావాల్సి ఉంది. కచ్చితంగా తెలంగాణ రక్షణసేన అధికారంలోకి వస్తుంది. అప్పుడు యువతకు అవసరమైన ఉద్యోగాలు కల్పిస్తాం. ఎలాంటి గ్యారంటీ లేకుండా వారికి 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని అన్నారు.

అమీర్పేటలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు హర్షణీయం:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కాట్రగడ్డ ప్రసూన కృతజ్ఞతలు

హైదరాబాద్ పెన్ పవర్: తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన మహానాయకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని అమీర్పేట కూడలిలో ప్రతిష్టించడం పట్ల సనత్నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుతమైన నిర్ణయాన్ని తీసుకుని, విగ్రహ ఏర్పాటుకు సహకరించిన గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ.. "తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న అన్న నందమూరి తారకరామారావు గారి విగ్రహాన్ని అమీర్పేట లాంటి ఒక ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయడం తెలుగుజాతికి గర్వకారణం. ఎన్టీఆర్ కేవలం ఒక పార్టీకో, ప్రాంతానికో పరిమితమైన నాయకుడు కాదు.. ఆయన యావత్ తెలుగుజాతి ఆస్తి. అలాంటి మహానుభావుడి

సంస్మరణకు, వారి కీర్తిని సమున్నతంగా నిలపడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చూపిన చొరవ, పెద్దమనసు నిజంగా అభినందనీయం" అని కొనియాడారు.రాజకీయాలకు అతీతంగా, తెలుగు

సంస్కృతిని, నాయకత్వ పటిమను రేవంత్ రెడ్డి దృక్పథం ఈ నిర్ణయంతో మరోసారి రుజువైందని ఆమె పేర్కొన్నారు. ఈ విగ్రహ ఏర్పాటు అమీర్పేట పరిసర ప్రాంతాల ప్రజలకే కాకుండా, నగరాసికులకు ఎంతో

సంతోషాన్ని ఇచ్చిందని ప్రసూన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

టీటీడీకి ఎలక్ట్రిక్ బస్సు విరాళం

హైదరాబాద్ పెన్ పవర్:

చెన్నైకి చెందిన ప్రముఖ భక్తుడు విష్ణువర్ధన్ టీటీడీకి ఆధునిక ఎలక్ట్రిక్ బస్సును విరాళంగా సమర్పించారు. శ్రీవారి ఆలయం సమీపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బస్సు తాళాలను టీటీడీ

అధికారులకు అందజేశారు ఈ బస్సును తిరుమలలో భక్తుల ఉచిత రవాణా సేవల కోసం వినియోగించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం తిరుమలలో ఇప్పటికే పలు ఎలక్ట్రిక్ "ధర్మరథం"

బస్సులు నడుస్తుండగా, కొత్త బస్సు చేరికతో సేవలు మరింత విస్తరించనున్నాయి. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా టీటీడీ పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాల వైపు అడుగులు వేస్తోందని అధికారులు తెలిపారు.

భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ఉచిత బస్సు సౌకర్యాలు మరింత బలోపేతం చేయాలని టీటీడీ యోచిస్తోంది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బివిఆర్ నాయుడుఅదనపు ఈవో వెంకయ్య చౌదరి

అధికారులు పాల్గొన్నారు

పీసీబీలో ఇంటి దొంగలు...

హైదరాబాద్,మే 30, పెన్ పవర్: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్వహిస్తున్న కంప్యూటరైజ్డ్ తనిఖీ విధానంపై తీవ్రమైన అభ్యంతరాలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిశ్రమల్లో ఏ నెలలో తనిఖీలు జరుగుతాయనే సమాచారాన్ని ముందే యాజమాన్యాలకు, అధికారులకు చేరవేయడం వల్ల ఉల్లంఘనదారులకు అది అనుకూలంగా మారుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. దీనివల్ల లోపాలను ముందే సరిదిద్దుకోవడం లేదా అధికారులను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉంటోందని తెలుస్తోంది.ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా 'సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్' రూపొందించిన ఒక ప్రత్యేక టూల్ ద్వారా ఈ కంప్యూటరైజ్డ్ తనిఖీలను పీసీబీ చేపడుతోంది. ఈ విధానంలో ప్రతి నెలా 70 నుండి 120 వరకు పరిశ్రమలలో తనిఖీలు నిర్వహిస్తుండగా, అందులో దాదాపు 30 వరకు రాజధాని పరిధిలోని మూడు జిల్లాల్లోనే ఉంటున్నాయి. ఏ అధికారి ఎక్కడ తనిఖీ చేయాలో పీసీబీ కార్యాలయంలోని ప్రత్యేక విభాగం నిర్ణయిస్తుంది. ఈ తనిఖీల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచుతున్నారు. అయితే, ఈ పద్ధతిని పక్కనపెట్టి ఆకస్మిక తనిఖీలు చేసేలా ఒక పటిష్టమైన ప్రత్యేక వ్యవస్థను తీసుకురావాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య ఉద్గారాల తీవ్రతను బట్టి వాటిని రెడ్, ఆరెంజ్, గ్రీన్ కేటగిరీలుగా విభజించి ఈ తనిఖీలు జరపాలి. గతంలో నిబంధనలు పాటించిన రికార్డులను బట్టి తనిఖీలను కేటాయిస్తారు. ఇన్ స్పెక్టర్లకు ఈ బాధ్యతలను రాండమ్‌గా లేదా రిస్క్ ఆధారంగా టూల్ ద్వారా కేటాయించడం జరుగుతుంది. తనిఖీ పూర్తయిన తర్వాత వాటర్, ఎయిర్ యాక్ట్‌ల ప్రకారం 72 గంటల్లోగా ఇన్స్‌పెక్షన్ రిపోర్టును ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వ్యర్థాల శుద్ధి, వాయు కాలుష్య మూలాలు, నియంత్రణ పరికరాలు, ప్రమాదకర వ్యర్థాల ఉత్పత్తి , వాటి నిల్వ, పారవేత వంటి కీలక అంశాలను ఈ నివేదికలో పొందుపరచాల్సి ఉంటుంది.మరోవైపు, ఆన్‌లైన్ ఫిర్యాదుల విభాగమైన 'జనవాణి'కి ప్రజల నుండి ప్రతి నెలా 50కి పైగా ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా వ్యర్థాలను ఇష్టానుసారంగా పారబోయడం, చెత్తను దహనం చేయడం, పరిశ్రమల నుండి వెలువడే ఘాటైన వాసనలు వంటి సమస్యలపై పౌరులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా ఆయా పరిశ్రమలలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి, ఆ నివేదికలను నేరుగా డాష్ బోర్డులో బహిరంగంగా ఉంచితే వ్యవస్థలో మరింత పారదర్శకత పెరుగుతుందని ప్రజల నుండి డిమాండ్లు వినిపిస్తున్నాయి

రైల్వే స్టేషన్ సోలార్ పవర్ ఆదా...

హైదరాబాద్,మే 30, పెన్ పవర్: : ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో సౌర విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. పర్యావరణహితంగా ఇక్కడ ఉత్పత్తి అవుతున్న సోలార్ పవర్‌ను స్టేషన్ పరిధిలోని వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎస్పీడీసీఎల్ సరఫరా చేసే సాధారణ విద్యుత్‌తో పోలిస్తే సోలార్ విద్యుత్ యూనిట్ ధర సగానికి సగం తక్కువగా ఉండటంతో.. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ ఎలక్ట్రికల్ విభాగానికి సంవత్సరానికి లక్షల రూపాయల ప్రజాధనం ఆదా అవుతోంది. ఈ విభాగం కేంద్ర ప్రభుత్వ విద్యుత్ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ జాతీయ ఇంధన పొదుపు అవార్డును కూడా సొంతం చేసుకోవడం విశేషం.దక్షిణ మధ్య రైల్వే కాచిగూడ స్టేషన్‌లో విద్యుత్ కొనుగోలు కోసం 2018లో ఢిల్లీకి చెందిన 'రెన్యూ పవర్స్ సిస్టమ్స్' సంస్థతో 25 ఏళ్ల పాటు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకుంది. ఇందులో భాగంగా యూనిట్‌కు రూ.5 చొప్పున సౌర విద్యుత్‌ను సరఫరా చేసేలా ఒప్పందం కుదిరింది. స్టేషన్ ప్లాట్‌ఫారాల భవనాలపై 200 కేడబ్ల్యూపీ సామర్థ్యంతో రెండు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, వీటిపై సోలార్ ప్యానెళ్లను అమర్చారు. మొత్తం సోలార్ యూనిట్ల సామర్థ్యం 400 కేడబ్ల్యూపీగా ఉంది.

గణనీయంగా పెరిగిన విద్యుత్ ఉత్పత్తి..

స్టేషన్ అవసరాల కోసం లోపల 1200 బీఎల్‌డీసీ ఫ్యాన్లు, 3 వేల ఎల్ఈడీ విద్యుత్ బల్బులను వాడుతున్నారు. వీటి కోసం, శీతాకాలంలో రోజుకు సగటున 1300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుత వేసవి కాలంలో ఎండల వల్ల ఈ ఉత్పత్తి రోజుకు 1700 యూనిట్లకు పెరిగింది.

ఏడాదికి రూ. 25 లక్షల ఆదా..

గత ఏప్రిల్ నెలలో ఈ సోలార్ ప్లాంట్ల ద్వారా 43 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, కాచిగూడ స్టేషన్ అవసరాలకు 49 వేల యూనిట్లను వినియోగించారు. సోలార్ పవర్ పోను మిగిలిన 7 వేల యూనిట్లను మాత్రమే ఎస్పీడీసీఎల్ నుండి యూనిట్‌కు రూ.10 చొప్పున కొనుగోలు చేశారు. సాధారణ విద్యుత్ రేటుతో పోలిస్తే సగం ధరకే (రూ.5) సోలార్ పవర్ లభించడంతో ఒక్క ఏప్రిల్ నెలలోనే రైల్వేకు రూ.2.12 లక్షలు మిగిలాయి. ఈ లెక్కన దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్‌కు సౌర విద్యుత్ వినియోగం వల్ల ఏడాదికి సుమారు రూ.25 లక్షల వరకు ఆదా అవుతుందని అధికారులు వెల్లడించారు.

రేవంత్ దిమ్మతిరిగే రాజకీయ వ్యూహం...



హైదరాబాద్,మే 30, (హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ రాజకీయ యవనికపై ఇప్పుడు రేవంత్ రెడ్డి సాహసం సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. ప్రాంతీయ విభేదాల కుంపట్ల మధ్య, సీమాంధ్ర పాలకులపైన, ఆంధ్రా మూలాలపైన ఒక వర్గం విపరీతమైన ద్వేషాన్ని నూరిపోస్తున్న వేళ.. హైదరాబాద్ నడిబొడ్డున, అమీర్‌పేట చౌరస్తాలో తెలుగుజాతి గర్వించదగ్గ మహానాయకుడు నందమూరి తారకరామారావు విగ్రహం కొలువుదీరింది. రేవంత్ రెడ్డి విమర్శల తుపానులను లెక్కచేయకుండా, స్వపక్షంలోని సొంత గొంతుల అభ్యంతరాలను తొక్కుకుంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించి తనేంటో, తన దమ్ము ఏంటో మరోసారి నిరూపించుకున్నారు. ఇది కేవలం ఒక విగ్రహావిష్కరణ కాదు.. తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసే రేవంత్ మార్క్ రాజకీయ చాణక్యం.కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా ఉంటూ, ఒకప్పటి ప్రత్యర్థి పార్టీ తెలుగుదేశం వ్యవస్థాపకుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం అంటే సామాన్యమైన విషయం కాదు. దీనిపై రాజకీయంగా ఎన్నో విమర్శలు, మరెన్నో అపోహలు సృష్టించే ప్రయత్నం జరిగింది. కానీ, రేవంత్ రెడ్డి వాటన్నింటినీ తనదైన శైలిలో తిప్పికొట్టారు. ఎన్టీఆర్‌ను ఏ ఒక్క ప్రాంతానికో, కులానికో పరిమితం చేయడం అజ్ఞానమే అవుతుందని చాటిచెప్పారు.సమాజంలో అణగారిన వర్గాల కోసం పోరాడిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పేదల పాలిట పెన్నిధిగా నిలిచిన ఇందిరా గాంధీ సరసన ఎన్టీఆర్‌ను నిలబెట్టి.. ఆయన నిరుపేదల పక్షపాతి అని నినదించారు. అన్నగారు తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక అని, ఆయన్ను ప్రాంతీయ సంకెళ్లతో బంధించలేమని రేవంత్ రెడ్డి భావోద్వేగంగా ప్రకటించిన తీరు.. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరి గుండెలను తాకింది.ఈ వేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై, ముఖ్యంగా కేసీఆర్‌పై సంధించిన విమర్శనాస్త్రాలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఎన్టీఆర్ పెట్టిన రాజకీయ భిక్షతో, ఆయన కాళ్ల చెంత రాజకీయ ఒనమాలు నేర్చుకుని, ఈ రోజు ఆ స్థాయికి చేరిన కేసీఆర్ వంటి నాయకులు.. ఇప్పుడు అదే ఎన్టీఆర్‌ను, ఆయన వారసత్వాన్ని విమర్శించడాన్ని రేవంత్ తీవ్రంగా తప్పుబట్టారు. ఎదిగిన కొద్దీ ఒదగాల్సింది పోయి, రాజకీయ జన్మనిచ్చిన నాయకుడినే విస్మరించడం, విమర్శించడం ద్రోహమే అవుతుందన్నారు. తెలంగాణ సమాజంలో కృతజ్ఞతకు, ద్రోహానికి మధ్య ఉన్న తేడాను కళ్లకు కట్టింది. అధికార దాహంతో చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేసిన వారికి ఈ విగ్రహావిష్కరణ ఒక గట్టి చెంపపెట్టుగా నిలిచింది.ఈ విగ్రహావిష్కరణ వెనుక రేవంత్ రెడ్డి కేవలం భావోద్వేగాన్నే నమ్ముకోలేదు.. అత్యంత పదునైన, వ్యూహాత్మక రాజకీయ చాణక్యాన్ని ప్రదర్శించారు. తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ఉన్న లక్షలాది మంది తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులను, నందమూరి అభిమానులను కాంగ్రెస్ వైపు తిప్పుకునేలా ఈ సందర్భాన్ని ఆయన మలుచుకున్నారుప్రాంతీయ విభేదాలను పక్కనబెట్టి, తెలుగు వారందరినీ ఒకే తాటిపైకి తెచ్చే మహా నాయకుడిగా తనను తాను ఆవిష్కరించుకున్నారు. అటు సీమాంధ్ర ఓటర్లలో నమ్మకాన్ని పెంచుతూనే, ఇటు తెలంగాణ ఆత్మగౌరవానికి తానే నిజమైన వారసుడినని నిరూపించుకున్నారు. వ్యూహాత్మకంగా ప్రత్యర్థుల నోళ్లు మూయించడంలో రేవంత్ రెడ్డి ఎంతటి సమర్థుడో ఈ ఘటనే సాక్ష్యంసవాళ్లకు ఎదురువెళ్లడం రేవంత్ రెడ్డి నైజం. విమర్శలు వస్తాయని తెలిసి కూడా, అమీర్‌పేట సాక్షిగా అన్నగారి విగ్రహాన్ని నిలబెట్టి, తెలుగుజాతి గుండెల్లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు. భావోద్వేగాలను రగిలిస్తూనే.. లౌక్యంతో, ధైర్యంతో రేవంత్ రెడ్డి వేసిన ఈ అడుగు తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘకాలం పాటు నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇది దమ్మున్న నాయకుడి.. దిమ్మతిరిగే రాజకీయ వ్యూహం

బిఆర్ఎస్ నేత చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్



హైదరాబాద్ పెన్ పవర్:

బిఆర్ఎస్ నేత చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను తెలంగాణ భవన్ దగ్గర పోలీసులు అరెస్ట్ చేసారు. తరువాత నాంపల్లి పీఎస్ కు తరలించారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బాల్కసుమన్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు, 3 రోజుల క్రితం సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో ఈరోజు ఉదయం పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల సింగరేణి జీఎం కార్యాలయాన్ని తగలబెట్టాలంటూ బాల్క సుమన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు., ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు మిలిటెంట్ తరహాలో ఉధృత పోరాటాలు చేయాలని ఆయన పిలుపుని చ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలనే ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు ఉన్నాయంటూ నమోదైన కేసుల ఆధారంగానే పోలీసులు ఈ రోజు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

బాల్క సుమన్ అరెస్ట్ వార్తతో నాంపల్లి కోర్టు పరిసరాల్లో పోలీసుల బందోబస్తును భారీగా పెంచారు.మరోవైపు తన అరెస్ట్ వార్తలను మాత్రం బాల్క సుమన్ ఖండించారు. తాను తెలంగాణ భవన్లోనే ఉన్నానని, అరెస్టు చేస్తే చట్టపరంగా ఎదుర్కొంటానని తెలిపారు.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

సర్.. ఫీవర్

హైదరాబాద్,మే 30, పెన్ పవర్:

తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ రాజకీయ పార్టీలో గుబులు రేపుతుంది. ముఖ్యంగా సెటిలర్ల ఓట్లపైనే ఇప్పుడు చర్చ జరుగుతుంది. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ తో రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగిన వారి ఓట్లు తొలగించే అవకాశాలున్నాయి. తెలంగాణకు ఒక ఏడాది ముందు ఎన్నికలు జరుగుతాయి. ఏపీలో ఆలస్యంగా జరుగుతుండటంతో రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారు అనేక మంది ఉన్నారు. హైదరాబాద్ తో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్న సెటిలర్లకు రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉన్నట్లు గుర్తించారు. 2024 ఎన్నికల సమయంలో హైదరాబాద్ తో పాటు తెలంగాణ నుంచి లక్షలాది మంది జనం ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం క్యూ కట్టారు.అయితే దేశంలో ఒకే చోట మాత్రమే ఓటు హక్కు ఉండాలి. రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉండటానికి వీలులేదు. కేంద్ర ఎన్నికల సంఘం రెండు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణ చేస్తుండటంతో ఎక్కడి ఓటు పోతుందన్న భయం ఓటర్లలో నెలకొంది. ఉపాధి నిమిత్తం వచ్చిన వారు తమ ఓటు హక్కును తెలంగాణలో వినియోగించుకోవడం, ఆంధ్రప్రదేశ్ లో సొంత ఇల్లు, భూమి ఉండటంతో ఆ ఎన్నికల సమయంలో అక్కడకు వెళ్లి ఓటు వేయడం రివాజుగా వస్తుంది. ఇలాంటి ఓట్లకు చెక్ పెట్టే సమయం ఆసన్నమయిందని అంటున్నారు. మరొకవైపు రాజకీయ

పార్టీలు ఓట్ల తొలగింపుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణలో జరిగిన తొలగింపులు అక్కడ పార్టీల ఓటమికి కారణమయ్యాయి. వచ్చే నెల నుంచి జాబితా సమగ్ర సవరణ ప్రారంభం కానుంది. జూన్ 25 వతేదీ నుంచి జులై 24 వతేదీ వరకూ బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికీ తిరిగి వివరాలు సేకరిస్తారు. జులై 31వ తేదీన

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురితమవుతుంది. అక్టోబరు 1వ తేదీన ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తారు. రెండు చోట్ల ఓట్లు కలిగి ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం

అధికారులు చెబుతున్నారు. దీంతో అన్ని రాజకీయ పార్టీలు ఓట్ల తొలగింపు ప్రక్రియపై తమ క్యాడర్ కు శిక్షణలు ఇస్తున్నాయి. మొత్తం మీద తెలంగాణలో సెటిలర్లు ఎక్కడ ఓటును ఉంచుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది

ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారితే?

హైదరాబాద్,మే 30, పెన్ పవర్:

హైదరాబాద్ నగరంలో భూమి ధరలు ఆకాశమే హద్దు అన్న చందంగా దూసుకుపోతున్నాయి. రాయదుర్గంలో ఎకరం రూ.237 కోట్లు పలికిందంటే అది కేవలం ప్రభుత్వ ఖజానాకు వచ్చిన ఆదాయం మాత్రమే కాదు, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే సగటు మనిషి ఆర్థిక స్థితిపై పడ్డ పెద్ద దెబ్బ. ప్రభుత్వం లాభాపేక్షతో భూములను కార్పొరేట్ సంస్థలకు వేలం వేయడం వల్ల, రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కృత్రిమమైన హైప్ సృష్టికి కారణం అవుతోంది. ఇది అంతిమంగా నిర్మాణ వ్యయం పెరగడానికి, తద్వారా సామాన్యుడికి సొంతింటిని అందని ద్రాక్షగా మార్చడానికి దారితీస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.సాధారణంగా ప్రభుత్వం భూములను ప్రజా అవసరాల కోసం స్కూళ్లు, ఆస్పత్రులు, పార్కులు , పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించాల్సి ఉంటుంది. కానీ, గత కొన్నేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం ఆదాయం కోసం భూములను మానిటైజేషన్ చేయడంపైనే దృష్టి పెట్టింది. రాయదుర్గం, కోకాపేట వంటి ప్రాంతాల్లో రికార్డు ధరలు పలకడం వల్ల పక్కనే ఉన్న గచ్చిబౌలి, నార్సింగి, శేరిలింగంపల్లి వంటి ప్రాంతాల్లో కూడా భూమి రేట్లు అమాంతం పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన అప్‌సెట్ ప్రైస్ మార్కెట్‌లో ఒక కొత్త బెంచ్‌మార్క్‌గా మారుతోంది, దీనివల్ల ప్రైవేట్ భూముల ధరలు కూడా నియంత్రణ లేకుండా పెరిగిపోతున్నాయి.ఒకప్పుడు సామాన్యుడు హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో చిన్న ప్లాటో లేదా ఫ్లాటో కొనుక్కునే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు అటువైపు కన్నెత్తి చూడాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక ఫ్లాట్ ధర కనీసం రూ.70 లక్షల నుండి రూ.1.5 కోట్ల వరకు పలుకుతోంది. ప్రభుత్వం భూములను వందల కోట్లకు విక్రయించడంతో, బిల్డర్లు ఆ ధరను భర్తీ చేయడానికి విలాసవంతమైన హై-రైజ్ అపార్ట్‌మెంట్‌లనే నిర్మిస్తున్నారు. దీనివల్ల అఫోర్డబుల్ హౌసింగ్ అనే కాన్సెప్ట్ హైదరాబాద్‌లో కనుమరుగైపోతోంది. మధ్యతరగతి ప్రజలు తమ జీవితకాల సంపాదనను ఇఎంఐ ల రూపంలో చెల్లించినా, ఒక చిన్న గూడు దక్కడం కష్టతరంగా మారుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ భూముల వేలం విధానంపై రాజకీయ విపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లా వ్యవహరిస్తోందన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నాయి. అభివృద్ధి పేరుతో భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, సామాన్యుడిని నగరం వెలుపలికి తరిమేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. భూముల విలువలను పెంచి స్టాంప్ డ్యూటీ ద్వారా అదనపు ఆదాయం పిండుకోవడం వల్ల రిజిస్ట్రేషన్ ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. ఇది కేవలం ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికే తప్ప, సామాన్యుడి సంక్షేమం కోసం కాదనే వాదన బలంగా వినిపిస్తోంది.ధరలు ఇలాగే అసహజంగా పెరిగితే భవిష్యత్తులో రియల్ ఎస్టేట్ బబుల్' ఏర్పడి మార్కెట్ కుప్పకూలే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కొనుగోలు శక్తికి మించి ధరలు పెరిగితే, ఇన్వెస్టర్లు వెనక్కి తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వం కేవలం ఆదాయంపైనే కాకుండా, సామాన్యుల నివాస అవసరాల కోసం ఒక సమగ్ర గృహ నిర్మాణ విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉంది. కేవలం ధనవంతులకు, ఐటీ కంపెనీలకే కాకుండా.. నగరంలో పనిచేసే సామాన్య కార్మికులు, ఉద్యోగులకు కూడా గూడు దక్కేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా ఎదగడం ఆహ్వానించదగ్గ పరిణామమే అయినా, అది సామాన్యుల కన్నీళ్ల మీద పునాదులు వేసుకోకూడదు. ప్రభుత్వం భూములను వేలం వేసి ఆదాయం సమకూర్చుకోవడం తప్పు కాకపోయినా, ఆ ఆదాయంలో కొంత భాగాన్ని తిరిగి పేద, మధ్యతరగతి గృహ నిర్మాణ పథకాలకు మళ్లించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది.

హైదరాబాద్ నగరంలో టీజీఐఐసి భూముల వేలం నిర్వహించింది. రాయదుర్గం ప్రాంతంలోని పాన్ మక్తా ఏరియాలోని సర్వేనెంబర్ 83/1 లో ఆరు ఎకరాల 29 గుంటల భూమికి వేలం వేస్తున్నారు.. ఎకరం భూమిని 237 కోట్లకు ఓ కంపెనీ కొనుగోలు చేసింది. ఇంకా ఈ భూమికి సంబంధించి వేలం జరుగుతున్న నేపథ్యంలో భారీగా సొమ్ములు ప్రభుత్వానికి సమకూరే అవకాశం కనిపిస్తోంది.గత ఏడాది ఇదే ప్రాంతంలో 7.6 ఎకరాలను ప్రభుత్వం వేలం వేసింది. అప్పుడు ఎకరం ధర 177 కోట్లు పలికింది. నాడు ప్రభుత్వానికి ఏకంగా 1357.59 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. ఇప్పుడు అంతకు మించిన స్థాయిలో ధర పలకడం విశేషం. హైదరాబాద్ నగరంలో పెద్దపెద్ద కంపెనీలు రియల్ ఎస్టేట్ వ్యవహారాలు సాగిస్తున్నాయి. భారీగా భవనాలను నిర్మిస్తున్నాయి. ముఖ్యంగా రాయదుర్గం.. మంచిరేవుల.. నార్సింగి.. కోకాపేట.. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్.. నేక్నాం పుర వంటి ఏరియాలలో భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడ ఎకరం ధర 100 కోట్లలో ఉంది. అందువల్లే ఇక్కడ భారీగా భవనాలను నిర్మించడానికి రియల్ ఎస్టేట్ కంపెనీలు ఆసక్తిని చూపిస్తున్నాయి. ఫార్మా కంపెనీలు.. ఫైనాన్షియల్ కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్న నేపథ్యంలో ఉద్యోగులు ఇక్కడ శాశ్వత నివాసం ఏర్పరచుకుంటున్నారు. అందువల్లే ఇక్కడ నివాస సముదాయాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఫలితంగా పెద్ద పెద్ద కంపెనీలు ఇక్కడ భూములను కొనుగోలు చేసి భారీ స్థాయిలో భవనాలను నిర్మిస్తున్నాయి. ఇప్పటికే రాజ్ పుష్ప.. అపర్ణ.. మై హోమ్.. జనప్రియ వంటి కంపెనీలు అత్యంత భారీగా నివాస సముదాయాలను నిర్మిస్తున్నాయి. అందువల్లే ఇక్కడ భూములను వందల కోట్లు ఖర్చుపెట్టి కొనుగోలు చేస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో ఒక ఎకరం వచ్చేసి 237 కోట్లు పలికిందంటే మామూలు విషయం కాదు. దీంతో యావత్ దేశం మొత్తం హైదరాబాద్ వైపు చూస్తోంది. కాగా, ధరలు ఈ స్థాయిలో పెరిగితే హైదరాబాదులో సామాన్యులు జాగాలు కొనే పరిస్థితి ఉండదని.. నిపుణులు చెబుతున్నారు.

గ్రేటర్‌లో 15 లక్షల రేషన్ కార్డులు.. సేవల్లో మాత్రం తీవ్ర జాప్యం

హైదరాబాద్,మే 30, పెన్ పవర్:

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పౌరసరఫరాల శాఖ అధికారుల మధ్య సరైన అవగాహన, సమన్వయం కరువవ్వడం ప్రజా పంపిణీ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ప్రాంతంలో సుమారు 15 లక్షలకు పైగా కుటుంబాలకు చెందిన అరకోటి మంది లబ్ధిదారులకు నిత్యావసరాలను సరఫరా చేసే ప్రక్రియలో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చీఫ్ రేషనింగ్ అధికారి కార్యాలయంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పౌరసరఫరాల విభాగాలు ఈ పంపిణీలో భాగస్వాములుగా ఉన్నాయి. సన్న బియ్యం, ఇతర నిత్యావసరాల సరఫరాతో పాటు కొత్త కార్డుల జారీ, తప్పుల సవరణ వంటి కీలక బాధ్యతలను ఈ విభాగాలు నిర్వహిస్తున్నాయి. అయితే అధికారుల మధ్య సయోధ్య లేకపోవడం వల్ల నిత్యావసరాల అక్రమ రవాణాకు దారితీస్తోందనే విమర్శలు వస్తున్నాయి. దీనితో పాటు రేషన్ కార్డుల మంజూరు, ధ్రువీకరణ ప్రక్రియల్లో తీవ్ర అలసత్వం జరుగుతోంది.కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవ ద్వారా వచ్చే దరఖాస్తులను అసిస్టెంట్ సప్లై ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి జిల్లా పౌరసరఫరాల అధికారి ద్వారా సీఆర్వో కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయి పరిశీలనలు సకాలంలో పూర్తికాకపోవడంతో కొత్త కార్డుల పంపిణీ నిలిచిపోయింది. ముఖ్యంగా జిల్లాల సరిహద్దుల్లో ఉండే కాలనీల దరఖాస్తులు ఏ అధికారి పరిధిలోకి వస్తాయనే దానిపై స్పష్టత లేకపోవడంతో విచారణలు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి. ఒక జిల్లాలో పంపిణీ మొదలైనా, పొరుగు జిల్లా పరిధిలోకి వచ్చే ప్రజలకు తమ కార్డులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. సమాచారం కోసం ప్రజలు మీసేవ కేంద్రాలు, పౌరసరఫరాల శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.రేషన్ సరుకులు తీసుకోవడానికి కొత్త కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల ప్రజలకు ఇంటి పక్కనే రేషన్ షాపు ఉన్నప్పటికీ, వారి కార్డులు వేరే జిల్లా పరిధిలోకి మారడంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న దుకాణాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డుల సంఖ్య పెరిగిన చోట కొత్త దుకాణాలను ఏర్పాటు చేయకపోవడంతో ఉన్న రేషన్ షాపులపైనే విపరీతమైన రద్దీ పెరుగుతోంది. దీనికి తోడు ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతోంది. సరుకుల అక్రమ రవాణాపై ఎవరికి వారు తమ పరిధిలోని అంశం కాదంటూ అధికారులు తప్పించుకుంటున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్లు, గ్రీవెన్స్ సెల్స్ ఉన్నప్పటికీ.. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రేషన్ కార్డులు , లబ్ధిదారుల గణాంక వివరాలను పరిశీలిస్తే.. మొత్తం నాలుగు జిల్లాల వ్యాప్తంగా 15,90,438 రేషన్ కార్డులు ఉండగా, వాటి ద్వారా 58,37,087 మంది లబ్ధిదారులు నిత్యావసర సరుకులను పొందుతున్నారు. ఇందులో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 8,41,954 కార్డులు, 32,24,963 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో ఉన్న మేడ్చల్ జిల్లాలో 4,74,855 రేషన్ కార్డులు ఉండగా, లబ్ధిదారుల సంఖ్య 16,45,039 గా ఉంది. అలాగే రంగారెడ్డి జిల్లా పరిధిలో 2,50,036 కార్డుల ద్వారా 8,83,620 మంది లబ్ధి పొందుతుండగా, అత్యల్పంగా సంగారెడ్డి జిల్లాలో 23,593 రేషన్ కార్డులు, 83,465 మంది లబ్ధిదారులు ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

జగన్ వార్నింగ్.. కేడర్ కు డబ్బు భయం? స్థానిక సమరంపై వైసీపీలో తర్జనభర్జన



హైదరాబాద్ పెన్ పవర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో అంతర్గతంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయని అంటున్నారు. ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా రాష్ట్రంలో ప్రతి స్థానం నుంచి పోటీ చేయాలని వైసీపీ బాస్ జగన్ పార్టీ కేడర్ ను ఆదేశించారు. ప్రధానంగా ఏ నియోజకవర్గంలో అయినా పోటీకి అభ్యర్థులు లేరన్న సాకు చూపకూడదని, అవసరమైతే బీసీ, ఎస్సీ కార్యకర్తలను రంగంలోకి దింపాలని జగన్ రెడ్డి సూచించారు. దీంతో స్థానిక ఎన్నికల్లో పార్టీ పట్టు నిరూపించుకోవాలని జగన్ రెడ్డి తహతహలాడుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంలో కేడర్ మాత్రం భిన్నంగా స్పందిస్తున్నట్లు అంతర్గత సంభాషణల్లో తెలుస్తోందని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంపై రాజీ లేని పోరాటం చేస్తున్న వైసీపీ కార్యకర్తలు స్థానిక ఎన్నికల్లో పోటీపై మాత్రం తీవ్ర తర్జనభర్జనకు గురవుతున్నారని అంటున్నారు. దీనికి ప్రధాన కారణం ఎన్నికల వ్యవస్థ డబ్బు మయంగా మారిపోవడమే అంటున్నారు. చిన్న పంచాయతీలో సర్పంచ్ పదవికి పోటీపడాలన్నా ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు ఖర్చు పెట్టాల్సివుంటుందని అంటున్నారు. అంత డబ్బు పెట్టి గెలిచినా, ప్రతిపక్షంలో ఉండటం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంల ప్రస్తుతం నెలకొన్ని ఆర్థిక ఇబ్బందులు కూడా దిగువస్థాయి కేడర్ ను భయపెడుతోందని అంటున్నారు. రానున్న రెండు మూడు నెలల్లో స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినందున ఈ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వంపై సానుకూల వాతావరణమే ఉందని ప్రభుత్వం చాటి చెప్పాలని అనుకుంటోంది. ఇదే సమయంలో వైసీపీ కూడా గట్టి వ్యూహంతోనే ముందుకు కదులుతోందని అంటున్నారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడా అధికార పార్టీకి తలొగ్గామనే అభిప్రాయం వ్యక్తం కావొద్దని, ప్రతిచోట అధికార పక్షాన్ని దీటుగా ఢీకొట్టాలని వైసీపీ హైకమాండ్ భావిస్తోంది. ప్రతి నియోజకవర్గంలో ఇంచార్జులను యాక్టివ్ చేసింది. ఎన్నికల్లో ప్రతి చోటా అభ్యర్థులను నిలిపే బాధ్యత నియోజకవర్గ ఇంచార్జిలకు అప్పగించింది. అయితే సర్పంచ్, ఎంపీటీసీ వంటి పదవులకు పోటీ చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నప్పటికీ డబ్బు సమస్యే వారిని ఊగిసలాటకు గురిచేస్తోందని చెబుతున్నారు. విపక్షంలో ఉండటం వల్ల గెలిచినా, గెలవకపోయినా పెద్దగా ప్రయోజనం ఉండదని ఎక్కువ మంది నేతలు అభిప్రాయపడుతున్నట్లు చెబుతున్నారు. లక్షల రూపాయలు కుమ్మరించి పోటీ చేసి ఆర్థిక ఇబ్బందులు తెచ్చుకోవడం ఎందుకు? అన్న ఆలోచనలో ఎక్కువమంది ఉన్నారని అంటున్నారు. అయితే పార్టీ అగ్ర నాయకత్వం మాత్రం ఎట్టిపరిస్థితుల్లో పోటీ చేయాల్సిందే అని పట్టుబడటం వల్ల చాలా మంది నియోజకవర్గ ఇంచార్జిలు ఏమైనా సాయం చేస్తారా? అని ఆశగా ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంలో హైకమాండ్ స్పష్టత ఇస్తే క్షేత్రస్థాయిలో పోటీకి పెద్ద ఎత్తున కార్యకర్తలు ముందుకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

ఫేక్ జీవోలతో రూ.1500 కోట్ల భూమికి ఎసరు? వైసీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడిపై కేసు



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ లోని గండిపేటలో రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ప్రయత్నించారని వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై నమోదైన కేసు సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడుతోపాటు నలుగురు పరారీలో ఉన్నారని, మరో ముగ్గురిని అరెస్టు చేశామని శేరిలింగంపల్లి డీఎస్పీ చింతమనేని శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. దీంతో ఈ వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. గండిపేటలో సుమారు రూ.1500 కోట్ల విలువైన కబ్జాపై మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వస్తున్నాయి. ఇందులో ప్రమేయం ఉందంటూ మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు రావడంతో ఆయన పరార్ అయ్యారని, ఆయన కోసం గాలిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. దీంతో ఈ వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారంగా మారుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. శేరిలింగంపల్లి డీఎస్పీ చింతమనేని శ్రీనివాస్ కథనం ప్రకారం హైదరాబాద్ శివార్లలోని గండిపేటలో సుమారు రూ.1500 కోట్ల విలువైన భూములను కాజేందుకు కొందరు స్కెచ్ వేశారని స్థానిక ఎమ్మార్వో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో మొత్తం ఏడుగురి పాత్ర ఉందని గుర్తించగా, వారిలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేరు చేర్చడంతో రాజకీయ సంచలనంగా మారిందని అంటున్నారు. గండిపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 18లో మొత్తం 104.25 ఎకరాలు ఉండగా, అందులో 9.28 ఎకరాలను గండిపేటకు చెందిన ఐదుగురు వ్యక్తులు తప్పుడు పత్రాలతో క్రమబద్ధీకరించుకున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారని డీఎస్పీ తెలిపారు. ఈ విషయం స్థానిక తహశీల్దార్ దృష్టికి వెళ్లిందని, ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని తహశీల్దార్ ఫిర్యాదు చేశారని డీఎస్పీ వెల్లడించారు. దీంతో నార్సింగి పోలీసులతోపాటు సైబర్ క్రైం, ఆర్థిక నేరాల విభాగం పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు నిర్వహించి కబ్జా కుట్రను భగ్నం చేసినట్లు డీఎస్పీ మీడియాకు వివరించారు. కాగా, వివాదంలో ఉన్న భూమిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించడంతో మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడును నిందితుడిగా చేర్చినట్లు చెబుతున్నారు. గండిపేటకు చెందిన నిమ్మల దశరథ కుటుంబ సభ్యులు ఈ భూమి తమదంటూ కొన్నాళ్లుగా చెబుతున్నారని

అంటున్నారు. దీనిపై వారు హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. హైకోర్టులో రిట్ పెండింగులో ఉండగా, నకిలీ జీవోలతో అమ్మేందుకు ప్రయత్నించారని పోలీసులు చెబుతున్నారు. నిమ్మల కుటుంబ సభ్యుల నుంచి భూమిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించడంతోనే మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తదితరులు కేసులో ఇరుక్కున్నట్లు ప్రచారం జరుగుతోంది. వివాదాస్పద భూమిని కొనుగోలు చేసేందుకు రూ.4 కోట్లు అడ్వాన్స్ చెల్లించడంతో పోలీసులు ఆయనను నిందితుడిగా చేర్చారని అంటున్నారు. దీంతోనే బొల్లా అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ అంశం రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

ఆ మూడు తప్ప... వైసీపీ టార్గెట్ 172

విజయవాడ, మే 30, పెన్ పవర్:

వైసీపీ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధపడుతోంది. నిన్న తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమన్వయకర్తలతో సమావేశం అయ్యారు జగన్మోహన్ రెడ్డి. ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలకు ఒప్పుకునేది లేదని.. ఏకంగా నియోజకవర్గ ఇన్చార్జిలపై వేటు పడుతుందని హెచ్చరించినంత పని చేశారు. అయితే అక్కడే ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొందరు.. బాధ్యతలు చూస్తున్న తమపై కాదు.. ఆ కీలక నియోజకవర్గాలపై దృష్టి పెట్టండి అన్నట్టు అంతర్గత చర్చల్లో చెబుతున్నారు వైసీపీ నేతలు. ముఖ్యంగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం, లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి, పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో కనీసం వైసిపి ఉనికి లేదు. నేతల జాడలేదు. ముందుగా అక్కడ పని చూడండి అన్నట్టు వైసిపి నేతల సూచన ఉంది. గత రెండేళ్లలో ఆ మూడు నియోజకవర్గాల్లో వైసిపి చేసిన కార్యక్రమం అంటూ లేకపోవడం విశేషం.వై నాట్ కుప్పం అంటూ సౌండ్ చేశారు వైసీపీ నేతలు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా కుప్పంను గెలిచేస్తాం అంటూ పెద్ద ఎత్తున ప్రకటనలు చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటివారు పెద్దదిక్కుగా మారిపోయారు. తన పుంగనూరు విడిచిపెట్టి మరి కుప్పం పై ఫుల్ ఫోకస్ పెట్టారు. భరత్ అనే నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. చంద్రబాబును సొంత నియోజకవర్గంలో అడుగుపెట్టనీయలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క పదవి కూడా వదలకుండా అంతా తీసుకున్నారు. అభివృద్ధి పనులు కూడా పగబట్టి మరీ చేశారు. కానీ కుప్పం ప్రజలు మాత్రం మళ్లీ చంద్రబాబునే పట్టం కట్టారు. ప్రస్తుతం అక్కడ వైసిపి ఇన్చార్జిగా ఉన్న భరత్ జాడలేదు. వైసిపి కార్యక్రమాలు జరగడం లేదు. పట్టించుకునే నాధుడు కూడా అక్కడ లేడు.ఇక మంగళగిరి విషయానికి వస్తే లోకేష్ మానియా నడుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి లోకేష్ వినూత్న తరహాలో ముందుకు వెళ్తున్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు. ఎంతలా అంటే ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా. 2019లో ఓడిపోయిన తర్వాత సొంత ఖర్చుతో అభివృద్ధి చేసి చూపించారు. ఇప్పుడేమో ప్రభుత్వపరంగా చేసి చూపిస్తున్నారు. గతంలో ఉన్న వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి జాడలేదు. మొన్న పోటీ చేసిన మహిళా నేత కనిపించడం లేదు. పైగా అక్కడ మాజీ మంత్రి ఒకరు లోకేష్ పట్ల అనుకూల ప్రకటనలు చేస్తున్నారు.పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు లేవు. మొన్నటి ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు ముద్రగడ పద్మనాభం. అయితే ఓడించలేక తన పేరు మార్చుకున్నారు ముద్రగడ పద్మనాభ రెడ్డి గా. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పెండ్యం దొరబాబు సైతం జనసేనలోకి వచ్చేసారు. పవన్ కళ్యాణ్ పై పోటీ చేసిన వంగా గీత ఆచూకీ లేదు. కనీసం అక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు లేవు. ఈ మూడు చోట్ల ముందు చూడండి.. తరువాత మాట్లాడండి అన్నట్టు ఉంది వైసీపీ నేతల వ్యవహార శైలి.

గుడివాడలో నాని చేతులెత్తేశారా....

మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. రెండు రోజుల క్రితం వైఎస్ జగన్ తో జరిగిన సమావేశంలో పాల్గొన్న కొడాలి నాని గుడివాడకు మాత్రం వెళ్లలేదు. 2024 ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత కొడాలి నాని గుడివాడకు దూరమయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. గుండెకు శస్త్ర చికిత్స జరగడం కొడాలి నాని హైదరాబాద్ కు మాత్రమే పరిమితమయ్యారు. ఏదైనా పోలీస్ స్టేషన్ కు రావాల్సినప్పుడే గుడివాడకు వస్తున్నారు తప్పించి అంతకు మించి ఆయన ప్రత్యేకంగా గుడివాడ వచ్చి వైసీపీ కార్యకర్తల

సమావేశంలో పాల్గొనలేదు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇంత వరకూ గుడివాడలో కార్యకర్తలతో భేటీ కూడా జరపలేదు.కొడాలి నాని మాత్రం గుడివాడలోని తన ముఖ్య అనుచరులతో టచ్ లోనే ఉన్నారు. హైదరాబాద్ లోనే ఎక్కువ కొడాలి నాని ఉంటున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో ఇప్పుడే రావడం అనవసరమని కొడాలి నాని భావిస్తున్నట్లుంది. గత ఎన్నికల్లో తన ఓటమిని జీర్ణించుకోలేని కొడాలి నాని తాను నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినా ప్రజలు తనను ఓడించడంపై ఒకింత అసంతృప్తితో తొలుత ఉన్నప్పటికీ

ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. గుడివాడ నియోజకవర్గంలోతొలి సారి ఓటమి పాలయిన తర్వాత గుడివాడకు పూర్తి దూరం పాటిస్తున్నారు. విజయవాడ వరకూ వచ్చి గుడివాడకు వెళ్లకపోవడం చర్చనీయాంశమైంది. 2004 కొడాలి నాని టీడీపీ నుంచి తొలిసారి గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి నాని ఎన్నికయ్యారు. 2009లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 ఎన్నికలకు వచ్చేసరికి వైసీపీలోకి వెళ్లారు.ఆ ఎన్నికలలో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మాత్రం వెనిగండ్ల రాము చేతిలో ఓటమి పాలయ్యారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దాదాపు రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేశారు. కానీ ఇప్పుడు గుడివాడకు వచ్చినా చేసేదేమీ లేదని, ఎన్నికలకు ఏడాది ముందు వచ్చి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు వైసీపీ అధినేత జగన్ నుంచి అనుమతి కూడా కొడాలి నాని తీసుకున్నట్లు తెలిసిం

మే నెలలో తలనీలాల రికార్డు

తిరుమల, మే 30, పెన్ పవర్: తిరుమలలో తలనీలాల సమర్పణలో ఏటికేడు కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. మే నెలలో గతంలో ఎన్నడూలేని విధంగా అత్యధిక మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు టీటీడీ వెల్లడించింది. గత సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయిలో తలనీలాల సమర్పణ జరిగినట్లు తెలిపింది. అలాగే భక్తుల రద్దీకి అనుగుణంగా కళ్యాణకట్టల వద్ద ఏర్పాట్లు చేశామని.. పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది.తిరుమల శ్రీవారికి తలనీలాలు సమర్పించే భక్తుల సంఖ్య ప్రతీ సంవత్సరం పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలోనే మే నెలలో కొత్త రికార్డులు నమోదు చేసింది. గత సంవత్సరాల కంటే 2026 మే నెలలో అత్యధిక మంది భక్తులు తలనీలాలు సమర్పించడం విశేషం. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా టీటీడీ ఏర్పాట్లు చేపట్టి, నిరంతరాయంగా సేవలు అందిస్తోంది. ఇక ఈ ఏడాది మే నెలలో 14,43,063 మంది భక్తులు తిరుమల శ్రీవారికి తమ తలనీలాలు సమర్పించుకున్నారు. 2024 మే నెలలో 10,65,729 మంది భక్తులు, 2025 మేలో 10,18,370 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకుంటే.. ఈ ఏడాది మే నెల కొత్త రికార్డులు నమోదు చేసింది.మరోవైపు ఇటీవల వేసవి సెలవులు, వారాంతపు రద్దీతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. మే 18వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు వరుసగా ఆరు రోజుల పాటూ రోజూ 50 వేల మందికిపైగా భక్తులు తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరీ ముఖ్యంగా మే 23వ తేదీ ఒక్కరోజే 57,580 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తలనీలాల సమర్పణకు ఎక్కువ సమయం పట్టకుండా టీటీడీ ఏర్పాట్లు చేసింది.ప్రధాన కళ్యాణకట్ట సహా పీఏసీ-1, పీఏసీ-2, పీఏసీ-3, పీఏసీ-5, జీఎన్సీ, హెచ్వీసీ, సప్తగిరి, నందకం, కౌస్తుభం, శ్రీవేంకటేశ్వర, శ్రీ పద్మావతి విశ్రాంతి గృహాలతో పాటుగా మొత్తం 11 మినీ కళ్యాణకట్టలు భక్తులకు అందుబాటులో ఉంచినట్లు టీటీడీ తెలిపింది. మొత్తం 1152 మంది క్షురకులు, అందులో 269 మంది మహిళా క్షురకులు భక్తులకు సేవలు అందిస్తున్నట్లు వెల్లడించింది. ఒక్కొక్కరు తమ 6 గంటల షిఫ్టులో 40 మందికి సేవ చేస్తారని తెలిపింది. మరోవైపు భక్తుల రద్దీకి అనుగుణంగా 250 మంది సిబ్బందికి అదనంగా విధులు కేటాయించినట్లు వెల్లడించింది.మరోవైపు తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులు కళ్యాణకట్టను అత్యంత పవిత్రంగా భావిస్తుంటారని.. అందుకే భక్తులకు ఇబ్బందులు కలగకుండా కళ్యాణకట్టలో పరిశుభ్రతకు పెద్దపీట వేసినట్లు టీటీడీ తెలిపింది. భక్తులకు కేటాయించే బ్లేడ్లు కూడా ముందుగా సోడియం సొల్యూషన్ లో ముంచి, డెటాయిల్‌తో శుభ్రపరుస్తున్నట్లు తెలిపింది. భక్తులు సమర్పించే తలనీలాలను ఎప్పటికప్పుడు సేకరించి భద్రపరుస్తున్నట్లు తెలిపింది. తలనీలాల సమర్పణ తర్వాత చందనం బిళ్లలు కూడా అందిస్తున్నట్లు వివరించింది.

కాబోయే అల్లుడికి ట్రాఫిక్ ఉల్లంఘనలా... ఇదేమి అంటూ ప్రశ్న


కాకినాడ, మే 30 పెన్ పవర్: ల్లికాని అబ్బాయిలూ మీకో ముఖ్యమైన గమనిక.. మీకు పిల్లనివ్వబోయే మామ మీ ఉద్యోగం, ఆస్తి, అలవాట్ల గురించి మాత్రమే కాదు.. మీపై ట్రాఫిక్ చలానాలు ఉన్నాయో కూడా తెలుసుకుంటున్నారు. మీరు ఉంటున్నది నిజమే.. తాజాగా కాకినాడకు చెందిన ఓ వ్యక్తి తనకు కాబోయే అల్లుడి గురించి ఆరా తీస్తే.. అతడిపై ట్రాఫిక్ చలానాలు ఉన్నాయా, లేదా కూడా ఆరా తీశఆరు.సాధారణం ఆడపిల్లకు పెళ్లి సంబంధాలు చూసే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటారు. పెద్దవాళ్లు చెప్పినట్లుగా అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాల సంగతి పక్కన పెడితే.. అబ్బాయి గుణగణాలు, అలవాట్లు వంటి అంశాలను తెలుసుకునే ప్రయత్నం కచ్చితంగా చేస్తుంటారు. కొంతమంది అబ్బాయి జీతం ఎంత, ఆస్తి ఎంత అని కూడా ఆరా తీసేవాళ్లు ఉంటారు. తమ బిడ్డ భవిష్యత్ బావుండాలనే ఉద్దేశంతోనే అమ్మాయి తల్లిదండ్రులు ఇలా అబ్బాయి గురించి ఎంక్వైరీ చేస్తుంటారు. కానీ కాకినాడ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మాత్రం అలా కాదు.. తనకు కాబోయే అల్లుడి గురించి ఆరా తీసేందుకు.. విచిత్రంగా యువకుడు నడిపే బైక్, కారుపై ఏవైనా చలానాలు ఉన్నాయి అంటూ ఆరా తీశారు. నేరుగా సీఐ దగ్గరకు వెళ్లి కాబోయే అల్లుడి గురించి అడిగి తెలుసుకున్నారు.కాకినాడలోని రాయుడుపాలేనికి చెందిన ఓ వ్యక్తి కూతురికి పెళ్లి చేద్దామని ఓ సంబంధం చూశారు. ఈ క్రమంలో తనకు కాబోయే అల్లుడి గురించి తెలుసుకోవాలనుకున్నారు. కాకపోతే ఆయన ఆ యువకుడి గుణగణాలు తెలుసుకోవడంతో పాటుగా కాస్త వినూత్నంగా ఆలోచించారు. తనకు కాబోయే అల్లుడు ట్రాఫిక్ నిబంధనలు ఎలా పాటిస్తున్నాడా.. వాహనాలు ఎలా నడుపుతున్నాడో తెలుసుకోవాలనుకున్నారు. రెండు రోజుల కిందట కాకినాడ భానుగుడి దగ్గర విధుల్లో ఉన్న ట్రాఫిక్-2 సీఐ డి రామారావును ఆయన కలిశారు. తనకు కాబోయే అల్లుడికి ఓ కారు, ఓ బైక్ ఉందని.. వాటి రిజిస్ట్రేషన్ నంబర్ల వివరాలు సీఐకి ఇచ్చారు. ఈ రెండు వాహనాలపై ఏమైనా చలానాలు ఉన్నాయేమో చెక్ చేయాలని కోరారు. ఒకవేళ ఈ వాహనాలపై చలానాలు ఉంటే కనుక తన కుమార్తెను ఇచ్చి పెళ్లి చేయనని సీఐతో చెప్పారు. ఆయన చెప్పిన మాటతో సీఐ కూడా అవాక్కయ్యారు.సీఐ రామారావు వెంటనే స్పందించి.. ఇలా ఎందుకు చేస్తున్నారు, కాబోయే అల్లుడి వాహనాలపై చలానాల గురించి ఎందుకు ఆరా తీస్తున్నారని ఆయనను అడిగారు. తన భార్య చనిపోయిందని.. తనకు ఒక్కగానొక్క కుమార్తె ఉందన్నారు. ఆమెను అల్లారుముద్దుగా పెంచుకున్నానని.. ఆమెకు పెళ్లి చేసే సమయంలో, అన్నీ చూసుకోవాలి కదా అన్నారు. అన్ని వివరాలు తెలుసుకున్న తర్వాతే ఆ అబ్బాయి చేతిలో పెట్టాలని అనుకుంటున్నానన్నారు. ఇలా ఆ తండ్రి కూతురిపై ఉన్న ప్రేమను వ్యక్తపరిచారు. తనకు కాబోయే అల్లుడు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా తాను భావిస్తానన్నారు. అప్పుడు తన కుమార్తెను బాగా చూసుకుంటాడని తనకు నమ్మకం ఉంటుందని సీఐ రామారావుతో చెప్పారు.వెంటనే సీఐ రామారావు కూడా చాలా పాజిటివ్‌గా స్పందించారు. ఆయన ఇచ్చిన రెండు నంబర్లతో చెక్ చేసి.. ఆ రెండు వాహనాలపై ఎలాంటి చలానాలూ లేవని చెప్పారు. దీంతో ఆయన చాలా ఆనందంగా అక్కడి నుంచి వెళ్లారు. కూతురి భవిష్యత్ కోసం ఒక తండ్రిగా చాలా గొప్పగా ఆలోచించారని.. ప్రతి ఒక్కరూ ఇలా ఆలోచిస్తే బావుటుందని సీఐ రామారావు అన్నారు. మొత్తం మీద కాకినాడకు చెందిన పెద్దాయన తన కూతురి భవిష్యత్ కోసం ఇంత దూరం ఆలోచించారా అంటూ చర్చించుకుంటున్నారు.

కృష్ణా , విజయనగరం రైతులకు జపాన్ ఎఫెక్ట్...

విజయవాడ, మే 30, పెన్ పవర్: భారత మామిడి పండ్లపై జపాన్ ప్రభుత్వం విధించిన తాజా నిషేధం ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా ఉమ్మడి కృష్ణా, ఖమ్మం విజయనగరం జిల్లాల మామిడి రైతులకు మరియు ఎగుమతిదారులకు పెద్ద షాక్‌గా మారింది. ఏపీలో అత్యధికంగా పండే, ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉన్న 'బంగినపల్లి' రకం మామిడి కాయల ఎగుమతులపై ఈ నిర్ణయం కోలుకోలేని దెబ్బ తీయనుంది. జపాన్ మార్కెట్‌లో ఏపీ మామిడి పండ్లకు చాలా ఎక్కువ ధర లభిస్తుండటంతో, ఈ నిషేధం వల్ల ఇక్కడి వ్యాపారులు, రైతులు కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.నిజానికి ఏపీ నుండి జపాన్‌కు మామిడి కాయలను ఎగుమతి చేసే ముందు నాణ్యతా ప్రమాణాల కోసం వాటికి వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ చేయడం తప్పనిసరి. అయితే, ఉత్తరప్రదేశ్‌లోని ఒక ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో క్వారంటైన్ నిబంధనలు, పురుగుల నివారణ ప్రక్రియల్లో లోపాలు ఉన్నట్లు జపాన్ ఫుడ్ అథారిటీ అధికారులు గుర్తించారు. జపాన్ దేశం పండ్ల ఈగల విషయంలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటిస్తుంది. ఒక ప్రాంతంలో లోపం జరిగినా, దాని ప్రభావం దేశవ్యాప్త ఎగుమతులపై పడటంతో ఏపీలోని అత్యాధునిక ప్యాక్ హౌస్‌ల ద్వారా ఎగుమతి చేసే రైతులు కూడా ఇప్పుడు నష్టపోవాల్సి వస్తోంది.ఈ ఏడాది ఇప్పటికే ఏపీలోని మామిడి రైతులకు వాతావరణం ఏమాత్రం కలిసిరాలేదు. ఎల్ నినో ప్రభావం వల్ల మార్చి, ఏప్రిల్ నెలల్లో నమోదైన విపరీతమైన ఎండలు, అకాల వాతావరణ మార్పుల కారణంగా పూత ఎండిపోయి, కాయ రాలిపోయి ఇప్పటికే 60 శాతం పైగా పంట నష్టం వాటిల్లింది. దిగుబడి తగ్గి కష్టాల్లో ఉన్న రైతులకు, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర దక్కుతుందనే ఆశ ఉండేది. కానీ కచ్చితంగా సీజన్ పీక్ స్టేజ్‌కు చేరే సమయంలో జపాన్ ఈ నిషేధాన్ని విధించడం ఏపీ మామిడి రైతులకు గోరుచుట్టుపై రోకటిపోటులా మారింది.ఇప్పుడు ఏపీ ఎగుమతిదారులు భయపడుతున్న మరో ముఖ్యమైన అంశం ఏంటంటే.. జపాన్ తీసుకున్న ఈ కఠిన నిర్ణయం వల్ల అంతర్జాతీయంగా భారతీయ క్వాలిటీ కంట్రోల్ సిస్టమ్స్‌పై నమ్మకం తగ్గే అవకాశం ఉంది. జపాన్ బ్యాన్‌ను చూసి ఏపీ మామిడిని భారీగా దిగుమతి చేసుకునే ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలు లేదా గల్ఫ్ దేశాలు కూడా తనిఖీలను కఠినతరం చేస్తే ఏపీ మామిడి మార్కెట్ పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ఉంది. ఏపీ ప్రభుత్వం, అపెడా అధికారులు తక్షణమే స్పందించి కేంద్రంతో మాట్లాడి, ఈ సాంకేతిక లోపాలను సవరించి జపాన్‌తో మళ్లీ చర్చలు జరపాలని రైతులు కోరుతున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

సొంత పల్లెకు వెళ్లి 30కోట్లతో బంగ్లా కట్టుకున్న ప్రముఖ అథ్లెట్!



భారతదేశ కీర్తిపతాకాన్ని అంతర్జాతీయ క్రీడావేదికలపై రెపరెపలాడించిన –గోల్డెన్ బాయ్–.. ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా నిర్మించుకున్న సొంత ఇల్లు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. హర్యానాలోని ఒక చిన్న గ్రామం నుండి క్రీడారంగంలో ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగిన నీరజ్ మెట్రో నగరాల వైపు వెళ్లకుండా తన సొంత మూలాలను గౌరవిస్తూ హర్యానాలోనే ఒక అద్భుతమైన విలాసవంతమైన బంగ్లాను నిర్మించుకున్నారు. తాజా మీడియా కథనాల ప్రకారం.. పానిపట్ సమీపంలోని అతడి సొంత గ్రామమైన ఖండ్రా లో నిర్మించిన ఈ మూడు అంతస్తుల బంగ్లా మార్కెట్ విలువ దాదాపు రూ. 30 కోట్లుగా ఉంది. ఈ నివాసం ఈ యువక్రీడాకారుడు సాధించిన అసాధారణ విజయాలకు..అతడికి ఉన్న వినమ్రతకు అద్దం పడుతోంది. ఈ విలాసవంతమైన బంగ్లా ఎక్స్ టీరియర్ ప్రశాంతతను పంచే తెలుపు, బేజ్ రంగుల కలయికతో పాటు ఎరుపు, బ్రౌన్ షేడ్స్ అల్లికతో ఎంతో హుందాగా డిజైన్ చేసారు.. ఇంటి ప్రధాన ప్రవేశద్వారం వద్ద బంగారు అక్షరాలతో ఉన్న –చోప్రాస్–నేమ్‌ప్లేట్‌తో పాటు, హైందవ సంస్కృతిని ప్రతిబింబించేలా –వసుధైవ కుటుంబకం– (ప్రపంచమే ఒక కుటుంబం) అనే సంస్కృత శ్లోకం ఉన్న ఫలకాన్ని అమర్చడం విశేషం. ఇది నీరజ్ చోప్రా సాంస్కృతిక వారసత్వాన్ని.. సాదాసీదా మనస్తత్వాన్ని చాటిచెబుతోంది. ఇంటి లోపలి భాగం విషయానికి వస్తే.. మినిమలిస్ట్ ఆధునిక శైలితో కూడిన లివింగ్ రూమ్, క్రీమ్ కలర్ కర్టెన్లు, బ్రౌన్ సోఫాలతో ఎంతో ఆహ్లాదకరంగా విలాసవంతంగా ఉంటుంది. ఈ ఇంటిలో అత్యంత ప్రత్యేకమైన, ఆకర్షణీయమైన విభాగం ఏదైనా ఉందంటే.. అది కేవలం నీరజ్ చోప్రా సాధించిన ఘనతలను ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా కేటాయించిన –ఒలింపిక్ ట్రోఫీ రూమ్–. ఈ గదిలో టోక్యో ఒలింపిక్స్‌లో దేశానికి తెచ్చిన చారిత్రాత్మక స్వర్ణ పతకం, వరల్డ్ ఛాంపియన్‌షిప్ మెడల్స్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అతడు అందుకున్న ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు.. జ్ఞాపికలను గర్వంగా ప్రదర్శించారు. ఈ గది చూసే ప్రతి ఒక్కరికీ నీరజ్ చోప్రా పడ్డ కష్టం– క్రమశిక్షణ– పట్టుదలను గుర్తుచేస్తూ స్ఫూర్తిని నింపుతుంది. దీనితో పాటు ఈ ప్రాజెక్ట్‌లో భారీ ఎత్తున ల్యాండ్‌స్కేప్ గార్డెన్ ఏరియాను కూడా డిజైన్ చేశారు. పచ్చని చెట్లు, మొక్కలతో ఉన్న ఈ తోటలో ప్రశాంతంగా కూర్చోవడానికి కుర్చీలు– ఊయలను కూడా ఏర్పాటు చేశారు. సెలబ్రిటీ హోదా వచ్చాక ముంబై లేదా ఢిల్లీ వంటి మెట్రోపాలిటన్ నగరాల్లో లగ్జరీ పెంట్‌హౌస్‌లు కొనుగోలు చేసే ధోరణికి భిన్నంగా నీరజ్ చోప్రా తన సొంత గ్రామంలోనే ఈ స్థాయి రియల్ ఎస్టేట్ ల్యాండ్‌మార్క్‌ను నిర్మించడంపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. చుట్టూ ఉన్న తమ వ్యవసాయ భూముల వీక్షణకు విశాలమైన బాల్కనీలు.. ప్రీమియం వాహనాల సేకరణ కోసం ప్రత్యేక గ్యారేజ్.. ట్రైనింగ్ కోసం అత్యాధునిక జిమ్ వంటి ఎన్నో ప్రపంచ స్థాయి వసతులు ఈ రూ. 30 కోట్ల బంగ్లాలో ఉన్నాయి. తన ఉమ్మడి కుటుంబం అంతా కలిసి నివసించేలా.. హర్యానా గ్రామీణ సంస్కృతి దెబ్బతినకుండా నిర్మించిన ఈ ఛాంపియన్ నివాసం.. కేవలం ఒక విలాసవంతమైన గృహం మాత్రమే కాదు.. కష్టపడితే గ్రామీణ యువత కూడా అంతర్జాతీయ స్థాయి జీవన ప్రమాణాలను అందుకోవచ్చని నిరూపించే ఒక సజీవ సాక్ష్యం.

రూపీ 2.0: త్వరలో రానున్న ప్లాస్టిక్ నోట్లు? ఆర్‌బీఐ కీలక ముందడుగు!



భారతీయ కరెన్సీ వ్యవస్థలో ఒక పెద్ద మార్పు రాబోతోందా? త్వరలోనే మన జేబుల్లోని కాగితపు నోట్ల స్థానంలో సరికొత్త 'ప్లాస్టిక్ నోట్లు' దర్శనమివ్వనున్నాయా? అంటే అవుననే అంటున్నాయి బ్యాంకింగ్ వర్గాలు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) త్వరలోనే ఈ మేరకు ఒక సంచలన ప్రాజెక్టును ప్రకటించే అవకాశముందని సమాచారం.

ప్రస్తుతం ఉన్న సమస్య ఏంటి?

ప్రస్తుతం మన దేశంలో చలామణిలో ఉన్న కరెన్సీ నోట్లను ప్రత్యేక కాటన్ ఆధారిత కాగితంతో తయారు చేస్తున్నారు.ఈ నోట్లు త్వరగా పాడైపోతుంటాయి. నోట్లు చిరిగిపోవడం, మురికిగా మారడం వల్ల ఆర్‌బీఐ తరచుగా కొత్త నోట్లను ముద్రించాల్సి వస్తోంది. దీనివల్ల ప్రభుత్వానికి నిర్వహణ ఖర్చులు భారీగా పెరుగుతున్నాయి.

పాలిమర్ (ప్లాస్టిక్) నోట్లు అంటే ఏమిటి? ఎందుకు బెటర్?

పాలిమర్ నోట్లు అంటే ఒక ప్రత్యేక రకమైన ప్లాస్టిక్ పదార్థంతో తయారయ్యే కరెన్సీ. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే వీటిలో అద్భుతమైన ఫీచర్లు ఉన్నాయి. ఇవి సాధారణ నోట్ల కంటే మూడు నుంచి నాలుగు రెట్లు ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. నీరు, దుమ్ము, తేమ, లేదా చెమట వంటి వాటికి ఇవి అస్సలు దెబ్బతినవు. భారతదేశం లాంటి విభిన్న వాతావరణ పరిస్థితులు ఉన్న దేశానికి ఇవి పర్ఫెక్ట్ ఛాయిస్. నకిలీ నోట్లకు కళ్లెం పడుతుంది. భద్రత పరంగా పాలిమర్ నోట్లు అత్యంత సురక్షితమైనవి. వీటిలో పారదర్శక విండోలు, హోలోగ్రామ్‌లు, అధునాతన సెక్యూరిటీ ఫీచర్లను సులభంగా అమర్చవచ్చు. ఫలితంగా నకిలీ నోట్ల ముద్రణకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ నోట్ల ట్రెండ్

ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే ఈ టెక్నాలజీని విజయవంతంగా వాడుతున్నాయి. ప్రపంచంలోనే తొలిసారిగా పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టిన దేశం ఆస్ట్రేలియా.. యునైటెడ్ కింగ్‌డమ్ కూడా పౌండ్ నోట్లను ప్లాస్టిక్‌లోకి మార్చి సక్సెస్ అయ్యింది. కెనడా, న్యూజిలాండ్ దేశాల్లో ప్లాస్టిక్ నోట్ల వల్ల నిర్వహణ ఖర్చులు భారీగా తగ్గాయి.

సవాళ్లు కూడా ఉన్నాయి..!

పాలిమర్ నోట్లను తీసుకురావడం వినడానికి బాగున్నా, దీని వెనుక భారీ కసరత్తు అవసరం అవుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఏటీఎం లు, నోట్ల లెక్కింపు యంత్రాలను కొత్త నోట్లకు అనుగుణంగా మార్చాల్సి ఉంటుంది. ప్లాస్టిక్ నోట్ల ముద్రణ కోసం సరికొత్త టెక్నాలజీ, ప్లాంట్లను ఏర్పాటు చేయాలి ప్రజల్లో ఈ నోట్ల వాడకంపై విస్తృతమైన అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఆర్‌బీఐ నుంచి దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ బ్యాంకింగ్ రంగంలో జరుగుతున్న ఈ చర్చలు భారత కరెన్సీ వ్యవస్థ ఆధునికీకరణ దిశగా ఒక కీలక అడుగుగా భావించవచ్చు. ఒకవేళ ఈ ప్రతిపాదన నిజమైతే భారతీయ కరెన్సీ చరిత్రలో ఇదొక సరికొత్త మైలురాయి కానుంది.

ఐటీ ఉద్యోగానికి 'గుడ్‌బై'.. ఆటో డ్రైవర్‌గా మారిన మహిళా టెక్కీ!

నేటి కార్పొరేట్ ప్రపంచంలో ఐటీ ఉద్యోగం అంటే అందరికీ ఒక కల. ఐదంకెల జీతం, ఏసీ రూములు, లగ్జరీ లైఫ్.. బయటకు కనిపించే ల్యావిష్ లైఫ్ వెనుక ఉండే అసలు కథ వేరేలా ఉంటుంది. విపరీతమైన పని ఒత్తిడి, నిరంతర డెడ్‌లైన్లు, మానసిక ఆందోళనలతో నేటి యువత సతమతమవుతోంది. సరిగ్గా ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొన్న ఓ మహిళా ఐటీ మేనేజర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. దాదాపు తొమ్మిదేళ్ల సాఫ్ట్‌వేర్ కెరీర్‌ను వదిలేసి ఆటో స్టీరింగ్ పట్టారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈమె సక్సెస్ స్టోరీ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

ఆశ్చర్యపోయిన ప్రయాణికురాలు.. వెలుగులోకి వచ్చిన కథ!

ఈ ఆసక్తికరమైన విషయాన్ని 'మిధ్లాజ్' అనే మహిళా ఎంట్రప్రెన్యూర్ తన ఇన్‌స్టాగ్రామ్ రీల్ ద్వారా వెలుగులోకి తెచ్చారు. ఒకరోజు ప్రయాణం కోసం ఆమె సాధారణంగానే ఒక ఆటో ఎక్కారు. అయితే ఆటో నడుపుతోంది ఒక మహిళ కావడంతో ఆమెతో మాటలు కలిపారు. ఈ క్రమంలో సదరు మహిళా డ్రైవర్ చెప్పిన గతం విని మిధ్లాజ్ ఒక్కసారిగా అవాక్కయ్యారు. "ఆమె సాధారణ ఆటో డ్రైవర్ కాదు.. ఒకప్పుడు కార్పొరేట్ ఆఫీసులో టీమ్‌ను లీడ్ చేసిన ఐటీ మేనేజర్!" అని మిధ్లాజ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

లక్షల జీతం ఉన్నా లేని ప్రశాంతత..

ఆ మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె దాదాపు 9 సంవత్సరాల పాటు ఐటీ రంగంలో మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మంచి జీతం, హోదా ఉన్నప్పటికీ.. నిరంతర మానసిక ఒత్తిడి ఆమె జీవితాన్ని భారంగా మార్చేసింది. విపరీతమైన పని ఒత్తిడి... టైట్ డెడ్‌లైన్స్, వ్యక్తిగత జీవితం లేకపోవడం... ఈ కారణాల వల్ల మానసిక ప్రశాంతత కరువైందని, చివరకు డబ్బు కంటే తన ఆరోగ్యమే ముఖ్యమని భావించి ఆ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు ఆమె పేర్కొన్నారు.



ఆటో డ్రైవింగ్‌తో కొత్త జీవితం.. సంపాదన ఎంతంటే?

కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలేసిన తర్వాత ఆమె ధైర్యంగా ఆటో డ్రైవింగ్‌ను వృత్తిగా ఎంచుకున్నారు. సమాజం ఏమనుకుంటుందో అని అస్సలు సంకోచించలేదు. ప్రస్తుతం ఆమె ఆటో నడుపుతూ నెలకు సుమారు రూ. 60,000 వరకు సంపాదిస్తున్నారు. జీతం గతంతో పోలిస్తే తగ్గినప్పటికీ.. "ఇప్పుడు నేను చాలా సంతోషంగా, ప్రశాంతంగా ఉన్నాను. నా జీవితం నా చేతుల్లోనే ఉంది" అని ఆమె ఎంతో గర్వంగా చెప్తున్నారు.

నెటిజన్ల ప్రశంసల జల్లు

ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు సదరు మహిళా డ్రైవర్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. "మానసిక ప్రశాంతతను మించిన సంపద మరొకటి లేదు." అని ఒకరు కామెంట్ చేయగా.. "ఉద్యోగం కంటే ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆమె ధైర్యానికి సెల్యూట్" అని మరికొందరు కొనియాడారు. అయితే ఈమె ఏ నగరంలో ఆటో నడుపుతున్నారనే వివరాలు వీడియోలో స్పష్టంగా వెల్లడించనప్పటికీ ఆమె తీసుకున్న నిర్ణయం మాత్రం లక్షల మందికి స్ఫూర్తినిస్తోంది. విజయం అంటే కేవలం బ్యాంక్ బ్యాలెన్స్ మాత్రమే కాదు.. జీవితంలో ఉండే సంతృప్తి, సంతోషం అని ఆమె మరోసారి నిరూపించారు.

కర్ణాటకలో పొలిటికల్ బిజినెస్.. సిద్ధూ రాజీనామాతో 'కాఫీ డే' ఇన్వెస్టర్ల పండుగ! ఎందుకంటే..



కర్ణాటకకు చెందిన ప్రముఖ కాఫీ చైన్ కంపెనీ కేఫ్ కాఫీ డే (సీసీడీ) షేర్లు భారీగా పెరగడం ఆ రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా ప్రకటించగానే ఇన్వెస్టర్లు కేఫ్ కాఫీ డే షేర్లు కొనుగోలు చేయడానికి మొగ్గు చూపడంతో ఆ షేరు ఏకంగా 29 శాతం అప్పర్ సర్క్యూట్ అయిందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. సహజంగా దేశ రాజకీయాల్లో మార్పులు సంభవించే సమయంలో స్టాక్స్ లో మార్పులు జరుగుతుంటాయని అంటున్నారు. కానీ, ఒక రాష్ట్రంలో ముఖ్యమంత్రి మారతారనే సమాచారంతో ఒక సంస్థ షేరు లాభాలు గడించడమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అయితే కేఫ్ కాఫీ డే షేరు పెరగడానికి కర్ణాటకలో చోటుచేసుకున్న రాజకీయ మార్పులే ప్రధాన కారణంగా కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. దీనికి కారణం ఆ సంస్థతో కాబోయే ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కు అనుబంధం ఉండటమే అంటున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా ప్రకటించడం, ఆయన స్థానంలో డీకే సీఎం అవ్వనున్నారనే సమాచారంతో కేఫ్ కాఫీ డే (CCD)ని నిర్వహించే 'కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్' షేర్లు ఏకంగా 20 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకిందని అంటున్నారు. ఈ నెల 29న రూ. 34.78 వద్ద ట్రేడ్ అవుతూ ఇన్వెస్టర్లకు భారీ లాభాలను తెచ్చిపెట్టిందని చెబుతున్నారు.

డీకే శివకుమార్ సక్సెస్.. జజణకి ప్లస్?

కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు సిద్ధరామయ్య దిగిపోవడంతో, తదుపరి ముఖ్యమంత్రిగా ప్రస్తుత డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పగ్గాలు చేపట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. డీకే శివకుమార్‌కు కేఫ్ కాఫీ డే (CCD) కుటుంబంతో అత్యంత సన్నిహిత సంబంధం ఉంది. జజణ వ్యవస్థాపకుడు, దివంగత వి.జి. సిద్ధార్థ కుమారుడైన అమర్త్య హెగ్డేకు.. డీకే శివకుమార్ పెద్ద కుమార్తె ఐశ్వర్యను ఇచ్చి వివాహం చేశారు. ఈ బంధం కారణంగానే, శివకుమార్ సీఎం కాబోతున్నారనే వార్త రాగానే కాఫీ డే షేర్లపై ఇన్వెస్టర్లు విపరీతమైన నమ్మకాన్ని చూపించారని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

లాభాల్లోకి దూసుకొచ్చిన కాఫీ డే

రాజకీయ పరిణామాలు ఇలా ఉంటే, కంపెనీ ఆర్థిక ఫలితాలు కూడా షేర్ల పెరుగుదలకు మరో కారణమ్యాయని అంటున్నారు.

గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం ఫలితాల్లో కేఫ్ కాఫీ డే అద్భుతమైన రికవరీని సాధించిందని గుర్తు చేస్తున్నారు. అంతకుముందు ఏడాది ఇదే క్వార్టర్‌లో రూ. 114.16 కోట్ల నెట్ లాస్‌లో ఉన్న కంపెనీ, ఈసారి ఏకంగా రూ. 132.07 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అలాగే కంపెనీ రెవెన్యూ కూడా 4.6 శాతం పెరిగి రూ. 280.51 కోట్లకు చేరుకుంది. ఇక ప్రస్తుతం డీకే శివకుమార్ ముఖ్య మంత్రి అయ్యే అవకాశాలు స్పష్టమవ్వడం, మరోవైపు కంపెనీ నష్టాల నుంచి లాభాల్లోకి రావడం కలిసి వచ్చి కాఫీ డే షేర్లు మార్కెట్లో హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయని చెబుతున్నారు.

'రియాక్టివ్ నుంచి ప్రాయాక్టివ్' వైపు మారాం.. ఆర్మీ చీఫ్ కీలక వ్యాఖ్యలు



దేశభద్రత, సైనిక వ్యూహాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులపై ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కీలక వ్యాఖ్యలు చేశారు. శత్రువుల చర్యలకు కేవలం స్పందించే (రియాక్టివ్) స్థాయి నుంచి, ముందే ఊహించి తిప్పికొట్టే (ప్రొయాక్టివ్) స్థాయికి మన సైన్యం ఎదిగిందని ఆయన స్పష్టం చేశారు. పూణేలో జరిగిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ) 150వ పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న ఆయన, యువ సైనికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆపరేషన్ సింధూర్ ను ప్రస్తావిస్తూ మన సైన్యం బలాన్ని చాటిచెప్పే ప్రయత్నం చేశారు.

ఆపరేషన్ సింధూర్ ఒక ఉదాహరణ

భారత్‌ను ఎవరైనా కవ్విస్తే దేశం ఏ రేంజ్‌లో స్పందిస్తుందో చెప్పడానికి 'ఆపరేషన్ సింధూర్' ఒక నిలువెత్తు నిదర్శనమని జనరల్ ఉపేంద్ర ద్వివేది గుర్తు చేశారు. "దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగిస్తే మన సైన్యం ఎంతటి కఠిన నిర్ణయాలకైనా వెనుకాడదని చెప్పడానికి ఈ ఆపరేషనే ఒక బెంచ్‌మార్క్. ఇది శత్రుదేశాలకు ఒక బలమైన హెచ్చరిక. మన రక్షణ వ్యవస్థ ఇప్పుడు మరింత దూకుడుగా, వ్యూహాత్మకంగా మారింది" అని ఆయన వివరించారు.

యువ సైనికులకు కీలక సూచనలు

టెక్నాలజీ మారుతున్న కొద్దీ ఆధునిక యుద్ధ తంత్రాలు కూడా మారుతున్నాయని ఆర్మీ చీఫ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎన్డీఏ నుంచి ఉత్తీర్ణులైన కేడెట్లను అభినందిస్తూ, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు నిరంతరం సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కేవలం సాంప్రదాయ యుద్ధాలకే పరిమితం కాకుండా సైబర్, స్పేస్, డ్రోన్ టెక్నాలజీ వంటి ఆధునిక రక్షణ రంగాలపై పట్టు సాధించాల్సిన అవసరం ఉందని సూచించారు. దేశ రక్షణ బాధ్యతలను భుజాన వేసుకోబోతున్న యువ అధికారులు ఎల్లప్పుడూ శత్రువు కంటే ఒక అడుగు ముందే ఉండాలని హితవుపలికారు. సరిహద్దుల్లో శాంతిని కాపాడటంతో పాటు, దేశ రక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఆర్మీ చీఫ్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. 'ఆపరేషన్ సింధూర్' అందించిన స్ఫూర్తితో భారత సైన్యం సరికొత్త రక్షణ వ్యూహాలతో ముందడుగు వేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదని అంటున్నారు. శత్రువుల వ్యూహాలను ముందే అడ్డుకునేలా భారత్ తీసుకుంటున్న 'ప్రొయాక్టివ్' నిర్ణయాలు దేశ రక్షణ రంగాన్ని మరింత పటిష్టం చేస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పసిడికి 'పన్ను' సెగ.. భారత్‌లో భారీగా తగ్గిన బంగారం డిమాండ్!

కేంద్రం నిర్ణయంతో బంగారం కొనుగోళ్లు డౌన్
పసిడిపై పన్ను భారం భారీగా పెంపు
నిత్యవసరాల ధరల పెరుగుదల వల్ల నష్టం
లైట్‌వెయిట్ నగల వైపు కస్టమర్ల మొగ్గు
పాత బంగారం అమ్మేందుకు జనం క్యూ



కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒక్క నిర్ణయం దేశంలో పసిడి అమ్మకాలను భారీగా తగ్గించేసింది. దిగుమతి సుంకాన్ని భారీగా పెంచడంతో విక్రయాలు పడిపోయాయి. ఇరాన్ ఉద్రిక్తతలతో పెరిగిన ఇంధన, ఆహార ధరలు తోడవడంతో జనం అసలు షాపుల వైపు వెళ్లడమే మానేశారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా పసిడి డిమాండ్ ఊహించని విధంగా 70 శాతం మేర పడిపోయింది.

పన్నుల భారం

బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం 6 శాతం నుంచి ఏకంగా 15 శాతానికి పెంచింది. దీనికి జీఎస్‌టీ కూడా చేరడంతో పసిడిపై పడే మొత్తం పన్ను భారం 9.18 శాతం నుంచి 18.45 శాతానికి చేరింది. రూపాయి విలువ పతనం కావడం, క్రూడాయిల్ ధరలు పెరగడంతో విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

వెలవెలబోతున్న జువెలరీ షాపులు

పన్నుల పెంపు దెబ్బకు దేశవ్యాప్తంగా పసిడి కొనుగోళ్లు భారీగా పడిపోయాయని 'ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్' వెల్లడించింది. గతేడాది మే నెల చివరి రెండు వారాల్లో 25 టన్నులుగా ఉన్న బంగారం డిమాండ్ ఈసారి కేవలం 7.5 టన్నులకే పరిమితమైంది. దేశీయ బంగారం వ్యాపారంలో 65 శాతం వాటా ఉన్న అసంఘటిత రంగం ఈ నిర్ణయంతో తీవ్రంగా ప్రభావితమైంది.

మోదీ పిలుపు

ఈ ఏడాది బంగారానికి దూరంగా ఉండాలంటూ ప్రధానమంత్రి మోదీ దేశ ప్రజలకు చేసిన విజ్ఞప్తి కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనితో పాటు పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలు పసిడి కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నాయి. ప్రస్తుతం ముంబై స్పాట్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.1.57 లక్షలు పలుకుతుండటం గమనార్హం.

లైట్‌వెయిట్ నగలకు క్రేజ్

బంగారం ధరలు ఆకాశాన్ని తాకడంతో కొనుగోలుదారులు తమ బడ్జెట్‌కు తగ్గట్టుగా తక్కువ క్యారెట్ ఉన్న లైట్‌వెయిట్ నగల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉండటాన్ని ఆసరాగా చేసుకొని చేతిలో డబ్బుల కోసం తమ పాత నగలను అమ్మి క్యాష్ చేసుకునేందుకు జనం జువెలరీ షాపుల వద్ద క్యూ కడుతున్నారు.

సావరిన్ గోల్డ్ బాండ్లపై కాసుల వర్షం.. ఒక లక్షకు రూ.3.27 లక్షలొచ్చాయ్!

- **ఎస్‌జీబీ 2021-22 సిరీస్-II ముందస్తు విమోచన ధరను ప్రకటించిన ఆర్‌బీఐ**
- **యూనిట్‌కు రూ.15,672గా ధరను నిర్ధారించిన కేంద్ర బ్యాంకు**
- **ఐదేళ్ల క్రితం జారీ ధర రూ.4,792 కాగా.. ఇప్పుడు 227 శాతం లాభం**
- **జూన్ 1 నుంచి బాండ్లను విత్‌డ్రా చేసుకునే అవకాశం**



సావరిన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) పథకంలో పెట్టుబడి పెట్టిన వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుభవార్త అందించింది. ఐదేళ్ల క్రితం జారీ చేసిన ఎస్‌జీబీ 2021-22 సిరీస్-×× బాండ్లకు సంబంధించిన ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ ప్రైస్ (ముందస్తు విమోచన ధర) ప్రకటించింది. పెట్టుబడిదారులకు ఊహించని రీతిలో ఏకంగా 227 శాతం అద్భుతమైన రాబడిని అందించేలా యూనిట్‌కు రూ.15,672గా ధరను ఖరారు చేసింది. అంటే.. ఇక్కడ ఐదేళ్ల కిందట రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసినట్లయితే వారికి ఇప్పుడు రూ. 3.27 లక్షల వరకు రాబడి వచ్చింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం సావరిన్ గోల్డ్ బాండ్లను జారీ చేసిన ఐదేళ్ల తర్వాత, వడ్డీ చెల్లించే తేదీల్లో వాటిని ముందస్తుగానే డబ్బుల్ని విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ సిరీస్ బాండ్లను 2021 జూన్ 1న జారీ చేసినందున, సరిగ్గా ఐదేళ్ల పూర్తయిన నేపథ్యంలో ఈ ఏడాది జూన్ 1 నుంచి పెట్టుబడిదారులు తమ బాండ్లను నగదుగా మార్చుకునేందుకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది.

విమోచన ధరను ఎలా లెక్కిస్తారు?

ముందస్తు విమోచన ధరను నిర్ణయించడానికి ఆర్‌బీఐ ఒక నిర్దిష్ట పద్ధతిని అనుసరిస్తుంది. ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రచురించే 999 స్వచ్ఛత కలిగిన బంగారం ధర ఆధారంగా దీనిని లెక్కిస్తారు. విమోచన తేదీకి ముందున్న మూడు పని దినాల బంగారం ముగింపు ధరల సగటును తీసుకుంటారు. ఈ సిరీస్ కోసం మే 26, మే 27, మే 29 తేదీల నాటి బంగారం ధరల సగటు ఆధారంగా రూ.15,672గా ధరను నిర్ణయించారు.

పెట్టుబడిదారులకు జాక్‌పాట్

2021లో ఈ బాండ్లను జారీ చేసినప్పుడు, ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారికి ఒక గ్రాము (యూనిట్) ధర రూ.4,792గా ఉంది. ఆఫ్‌లైన్‌లో కొన్నవారికి దీని ధర రూ.4,842గా ఉంది. ఇప్పుడు ఆర్‌బీఐ ప్రకటించిన విమోచన ధర రూ.15,672తో పోలిస్తే, ఆన్‌లైన్ పెట్టుబడిదారులకు ప్రతి గ్రాముపై వడ్డీని మినహాయించి రూ.10,880 నికర లాభం వస్తోంది. అంటే.. కేవలం ఐదేళ్ల కాలంలోనే వారి పెట్టుబడిపై 227.05 శాతం రాబడి లభించినట్లయింది. సాధారణంగా ఎస్‌జీబీల కాలపరిమితి 8 సంవత్సరాలు కాగా, ఐదేళ్ల తర్వాత ఇలాంటి అధిక రాబడితో బయటకు వచ్చే అవకాశం కల్పించడం పెట్టుబడిదారులకు ఎంతో లాభదాయకంగా మారింది.

కష్టాల్లో స్పైస్‌జెట్.. రూ. 124 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు



ప్రముఖ బడ్జెట్ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. నెలల తరబడి జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయడంలో విఫలమైనందుకు గాను వస్తు సేవల పన్ను (జీఎస్టీ) శాఖ ఆ సంస్థకు రూ. 124.65 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు జారీ చేసింది. అంతేగాక పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున కంపెనీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది.నిర్దేశిత గడువులోగా స్పైస్‌జెట్ రిటర్నులు దాఖలు చేయకపోవడంతో జీఎస్టీ చట్టంలోని సెక్షన్-62 కింద అధికారులు ప్రొవిజనల్ అసెస్‌మెంట్ నిర్వహించి ఈ పన్ను డిమాండ్‌ను ఖరారు చేశారు. నవంబర్ నెలకు రూ. 44.44 కోట్లు, డిసెంబర్‌కు రూ. 43.79 కోట్లు, జనవరికి రూ. 12.19 కోట్లు, ఫిబ్రవరికి రూ. 12.10 కోట్లు, మార్చి నెలకు రూ. 12.12 కోట్ల చొప్పున బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

జీఎస్టీ రిజిస్ట్రేషన్ రద్దుకు సంబంధించి ఈ నెల 25న షోకాజ్ నోటీసు జారీ చేసినప్పటికీ, సంస్థ నుంచి ఇంకా పూర్తిస్థాయి స్పందన రాలేదని తెలుస్తోంది. "పెండింగ్‌లో ఉన్న రిటర్నులను స్పైస్‌జెట్ వెంటనే దాఖలు చేసి, చట్టపరమైన నిబంధనలు పాటించకపోతే, కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఓ అధికారి స్పష్టం చేశారు.కాగా, స్పైస్‌జెట్ ఇప్పటికే తీవ్ర నష్టాల్లో కొనసాగుతోంది. 2025 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.621 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. నిన్నటి ట్రేడింగ్‌లో బీఎస్ఈలో స్పైస్‌జెట్ షేరు ధర 0.47 శాతం తగ్గి రూ.12.75 వద్ద ముగిసింది.

కిటికీ దగ్గర సిగరెట్ కాల్చినా పిల్లల ప్రాణాలకు ముప్పే!

సిగరెట్ రసాయనాలు ఇల్లంతా వ్యాపించే అవకాశం
వస్తువులపై మిగిలిపోయే వ్యర్థాలతో థర్డ్ హ్యాండ్ స్మోక్
వేగంగా శ్వాస తీసుకోవడం వల్ల పిల్లలపై ప్రభావం
ఆస్తమా, నిమోనియా వంటి వ్యాధుల ముప్పు
ఇళ్లను పూర్తిగా స్మోక్-ఫ్రీగా మార్చాలని సూచన



"మేము పిల్లల ముందు సిగరెట్ తాగడం లేదు.. కిటికీ దగ్గరో, బాల్కనీలోనో కాలుస్తున్నా" అని చాలామంది పొగతాగేవాళ్లు సమర్థించుకుంటారు. కానీ ఇలా చేయడం వల్ల పిల్లలకు ఎలాంటి ముప్పూ ఉండదనుకోవడం చాలా పెద్ద భ్రమ అని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి తాత్కాలిక ఏర్పాట్లు పిల్లలను 'పరోక్ష ధూమపానం' బారిన పడకుండా అస్సలు కాపాడలేవని స్పష్టం చేస్తున్నారు.

తిష్టవేసే విష రసాయనాలు

సిగరెట్ పొగలో నికోటిన్, కార్బన్ మోనాక్సైడ్, ఫార్మాల్డిహైడ్ వంటి వేలాది ప్రమాదకర రసాయనాలు ఉంటాయి. కిటికీ పక్కన నిలబడి తాగినా పొగలోని విష కణాలు గాలి ద్వారా ఇల్లంతా వ్యాపిస్తాయి. అవి ఇంట్లోని సోఫాలు, పరదాలు, బట్టలు, బెడ్ షీట్లు, గోడలకు గట్టిగా అంటుకుపోతాయి. పెద్దల కంటే పిల్లలు చాలా వేగంగా శ్వాస తీసుకుంటారు. అందువల్ల ఈ విషపూరిత గాలి వారి శరీరంలోకి సులభంగా ప్రవేశిస్తుంది.

ముంచుకొస్తున్న ముప్పు

సిగరెట్ తాగడం ఆపేసిన తర్వాత కూడా గాలిలో, వస్తువులపై మిగిలిపోయే విష వ్యర్థాలనే 'థర్డ్ హ్యాండ్ స్మోక్' అంటారు. ఈ హానికరమైన కణాలు ఇంట్లోని వస్తువులపై చాలా కాలం పాటు అలాగే ఉండిపోతాయి. పిల్లలు ఆయా వస్తువులను తాకినప్పుడు లేదా అక్కడ ఆడుకుంటున్నప్పుడు ఆ విష రసాయనాలు వారి చర్మం ద్వారా, శ్వాస ద్వారా లోపలికి వెళ్లిపోతాయి. చాలామంది తల్లిదండ్రులు ఈ ప్రమాదాన్ని అస్సలు గుర్తించలేకపోతున్నారు.

పిల్లల ఊపిరితిత్తులపై ప్రభావం

ఇంట్లో పొగతాగే అలవాటున్నవారి పిల్లల్లో రోగనిరోధక శక్తి, ఊపిరితిత్తుల ఎదుగుదల దారుణంగా దెబ్బతింటుంది. దీనివల్ల పిల్లలు తరచూ దగ్గు, ఉబ్బసం, ఆస్తమా, అలర్జీలు, గొంతు మంట, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ బారిన పడుతుంటారు. మరీ చిన్న పిల్లల్లో అయితే బ్రాంకైటిస్, నిమోనియా, చెవి ఇన్‌ఫెక్షన్లు, నిద్రలేమి సమస్యలు వస్తాయి. కొన్ని తీవ్రమైన కేసుల్లో శిశువులు హఠాత్తుగా మరణించే ప్రమాదం కూడా ఉంది.

ఇల్లే రక్షణ కవచం కావాలి

పిల్లలను ఈ ప్రమాదం నుంచి కాపాడుకోవాలంటే కిటికీలు తెరిచి ఉంచడం, బాల్కనీలో తాగడం లాంటి పనులు సరిపోవని నిపుణులు చెబుతున్నారు. ఇల్లు, కార్లను పూర్తిగా 'స్మోక్-ఫ్రీ'గా మార్చడమే ఏకైక మార్గం. పిల్లల భవిష్యత్తు, ఆరోగ్యం కోసం ఇంట్లో పొగతాగడం పూర్తిగా మానేయాలి. వీలైతే ఆ అలవాటుకు శాశ్వతంగా స్వస్తి పలకడమే ఉత్తమమైన నిర్ణయం.

ఏఐ దెబ్బకు ఉద్యోగాలు గోవిందా.. 7వేల 800 మందిని తీసేస్తున్న స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ సాంకేతికత బ్యాంకింగ్ రంగాన్ని ఏ విధంగా మార్చేయబోతుందో లండన్ ప్రధాన కార్యాలయంగా పనిచేసే ప్రముఖ అంతర్జాతీయ బ్యాంక్ 'స్టాండర్డ్ చార్టర్డ్' స్పష్టం చేసింది. రాబోయే 2030 నాటికి తమ కార్పొరేట్ ఫంక్షన్ విభాగాల నుంచి దాదాపు 15 శాతం ఉద్యోగాలను తగ్గించుకోనున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. దీనివల్ల సుమారు 7వేల 800 మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారు.

ఈ భారీ లేఆఫ్స్ బ్యాంక్ యొక్క బ్యాక్-ఆఫీస్ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. గ్లోబల్ బ్యాంక్ నిర్వహణకు కీలకమైన ఆపరేషన్స్, కాంప్లయన్స్ సపోర్ట్, ఫైనాన్స్ ప్రాసెస్, రిస్క్ అడ్మినిస్ట్రేషన్, హెచ్ఆర్ సిస్టమ్స్ వంటి అంతర్గత విభాగాల్లో ఈ లేఆఫ్స్ ఎక్కువగా ఉండనున్నాయి. ఆయా విభాగాల్లో ఉన్న 52వేల మంది సిబ్బందిలో దాదాపు 7వేల నుండి 7వేల 800 మంది వరకు ఉద్యోగాలు కోల్పోనున్నారు.

ఈ తొలగింపులపై స్టాండర్డ్ చార్టర్డ్ సీఈఓ బిల్ వింటర్స్ చేసిన వ్యాఖ్యలు కార్మిక సంఘాలు, ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయి. కొన్ని విభాగాల్లో ఉద్యోగుల భర్తీ గురించి ఆయన కామెంట్స్ వివాదాస్పదం అయ్యాయి. టెక్నాలజీ కేవలం ఉద్యోగుల పనిని సులువు చేయడం మాత్రమే కాదు.. కంపెనీలు తక్కువ మంది సిబ్బందితో నడిచేలా మార్పులు తీసుకువస్తుందని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోంది. రాబోయే రోజుల్లో ఏఐ టూల్స్ వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందనే ఆందోళనను ఈ కార్పొరేట్ నిర్ణయం నిజం చేస్తోంది. ఏఐ పెట్టుబడుల కారణంగా బ్యాంకింగ్ రంగంలో మానవ వనరుల అవసరం ఎంతలా తగ్గిపోతుందో చెప్పడానికి స్టాండర్డ్ చార్టర్డ్ లో జరుగుతున్న మార్పులు పెద్ద ఉదాహరణగా నిలిచాయి.

దోసకాయతో కొత్త రుచులు.. ఆరోగ్యానికి ఆరోగ్యం, రుచికి రుచి!





వేసవి కాలంలో దోసకాయ తింటే ఆరోగ్యానికి చాలా మంచిది. నీటి శాతం ఎక్కువగా ఉండే ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. అలాగే బరువు తగ్గడం, జీర్ణక్రియను మెరుగుపరచడం, చర్మ ఆరోగ్యాన్ని పెంచడం, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. తక్కువ కేలరీలు, ఎక్కువ పోషకాలు ఉండటం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. అలాంటి దోసకాయతో చేసే కొన్ని వంటకాల గురించి ఈ రోజు తెలుసుకుందాం...

రోటి పచ్చడి

కావాల్సిన పదార్థాలు : దోసకాయలు -- అరకేజీ, పల్లీలు -- పావుకప్పు, పచ్చిమిర్చి -- పదిహేను, టమాటాలు -- మూడు, చింతపండు చిన్న నిమ్మకాయంత, వెల్లుల్లి రెబ్బలు -- ఎనిమిది, ఉప్పు -- రుచికి సరిపడా, ఉల్లిగడ్డ -- ఒకటి, కొత్తిమీర తరుగు -- కొద్దిగా, జీలకర్ర టీస్పూన్

తయారీ విధానం: దోసకాయను చెక్కు తీసి ముక్కలుగా కట్ చేసుకోవాలి. అలాగే పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ ముక్కలుగా తరుక్కొని పక్కన పెట్టుకోవాలి. స్టవ్‌పై పాన్ పెట్టి నూనె వేయండి. పల్లీలు వేసి దోరగా వేపి పక్కన పెట్టుకోండి. అదే పాన్‌లో పచ్చిమిర్చిలు, రుచికి సరిపడా ఉప్పు వేసి కాసేపు వేపుకోండి. తర్వాత టమాటా ముక్కలు, చింతపండు వేసి వేపుకోండి. ఇప్పుడు రోటిలో జీలకర్ర, వెల్లుల్లిరెబ్బలు, పల్లీలు ఇలా ఒకదాని తర్వాత ఒకటి వేసి మెత్తగా దంచుకోండి. చివరగా పచ్చిమిర్చి, టమాటా కూడా వేసి దంచుకోండి. ఇందులోనే దోసకాయ, ఉల్లిగడ్డ ముక్కలు వేసి కచ్చాపచ్చాగా దంచుకోండి. చివరగా కాస్త కొత్తిమీర కూడా వేసుకోండి. ఆయిల్ వేడిచేసుకొని ఆవాలు, జీలకర్ర, శనగపప్పు, మినప్పప్పు, కరివేపాకుతో పాటు ఎండుమిర్చిని తుంపి వేసుకొని పచ్చడి తాలింపు వేసుకుంటే చాలు. రుచికరమైన 'దోసకాయ రోటి పచ్చడి' రెడీ!

దోసకాయ తోటకూర కర్రీ

కావాల్సిన పదార్థాలు: తోటకూర -- ఆరు కట్టలు(చిన్న), దోసకాయలు -- 600 గ్రాములు, నూనె -- ఐదారు టేబుల్‌స్పూన్లు, వెల్లుల్లి రెబ్బలు -- 10 నుంచి 12, ఎండుమిర్చి -- నాలుగు, ఉల్లిగడ్డ -- రెండు(మీడియం సైజ్‌వి), పసుపు -- కొద్దిగా, ఉప్పు -- రుచికి తగినంత, టమాటాలు -- మూడు, కారం -- రెండు టీస్పూన్లు, ధనియాల పొడి -- రెండు టీస్పూన్లు, కొత్తిమీర తరుగు -- కొద్దిగా.

తయారీ విధానం: ముందుగా కాస్త లేతగా ఉండే తాజా తోటకూరను కాడల నుంచి వేరు చేసుకొని ఒక గిన్నెలో వేసుకోవాలి. ఆపై ఒకటికి రెండు సార్లు శుభ్రంగా కడిగి సన్నగా తరుక్కొని పక్కనుంచాలి. అలాగే దోసకాయలను చెక్కు తీసుకొని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. దోసకాయలు ఎక్కువగా ఉండి తోటకూర కాస్త తక్కువగా ఉండే కర్రీ మంచి రుచికరంగా వస్తుంది.

ఆయిల్ వేడయ్యాక తాలింపు గింజలు(ఆవాలు, జీలకర్ర, శనగపప్పు, మినపప్పు) వేసి ఆవాలు చిటపటమనేవరకు వేయించుకోవాలి. అందులో కచ్చాపచ్చాగా దంచిన వెల్లుల్లి రెబ్బలు, ఎండుమిర్చి తుంపలు వేసి పచ్చివాసన పోయేంత వరకు వేయించాలి. తర్వాత ఉల్లిగడ్డ ముక్కలు వేసి అవి మెత్తబడే వరకు వేయించుకోవాలి. అందులోనే పసుపు, రుచికి తగినంత ఉప్పు వేసుకోవాలి. ఉల్లిగడ్డ సగం వరకు వేగిన తర్వాత కరివేపాకు వేయాలి. ఉల్లిగడ్డ కాస్త మెత్తబడ్డాక టమాటా ముక్కలు, దోసకాయ ముక్కలు, తోటకూర తరుగుని కూడా వేసి ఒకసారి బాగా కలపాలి. తర్వాత మూతపెట్టి లో ఫ్లేమ్‌లో మధ్యమధ్యలో కలుపుతూ అన్నీ చక్కగా మగ్గేంత వరకు పది నుంచి పన్నెండు నిమిషాలు ఉడికించాలి. దోసకాయ ముక్కలు మగ్గాయనుకున్నాక తోటకూరను గరిటెతో మాష్ చేస్తున్నట్లు కలుపుకోవాలి. తర్వాత రుచిని బట్టి తగినంత కారం, ధనియాల పొడి వేసుకొని బాగా కలపాలి. మూతపెట్టి మరో రెండు నిమిషాల పాటు సన్నని సెగ మీద మగ్గించుకొని స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. చివర్లో కొత్తిమీర తరుగు వేసుకొని కలిపి దింపేసుకుంటే చాలు. అంతే కమ్మని రుచితో నోరూరించే 'దోసకాయ తోటకూర కర్రీ' రెడీ అయిపోతుంది!

దోసకాయ ఆవకాయ

కావలసిన పదార్థాలు: దోసకాయ ముక్కలు -- కప్పు, కారం -- మూడు నాలుగు టేబుల్ స్పూన్లు, ఆవ పొడి -- రెండు మూడు టేబుల్ స్పూన్లు, ఉప్పు -- తగినంత, నూనె -- తగినంత, వెల్లుల్లి రెబ్బలు -- పది నుండి పదిహేను, నిమ్మరసం -- కొద్దిగా (కావాలంటే).

తయారీ విధానం: దోసకాయను శుభ్రంగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా కోసి తడి లేకుండా చూసుకోవాలి. ఒక గిన్నెలో ముక్కలు, కారం, ఉప్పు, ఆవ పొడి, వెల్లుల్లి వేసి కలపాలి. నూనె కాచి, చల్లారిన తర్వాత పచ్చడిలో పోసి బాగా కలపాలి. చివరగా నిమ్మరసం పిండుకుంటే రుచి మరింత పెరుగుతుంది. దీనిని గాలి చొరబడని కంటైనర్‌లో నిల్వ చేసుకోవచ్చు.

దోసకాయ పూర్ణం

కావల్సిన పదార్థాలు: చిన్న దోసకాయలు -- అరకేజీ, చింతపండు, వేయించిన వేరుశనగ గుళ్లు, నువ్వులు, ధనియాలు, ఎండు మిర్చి, కొబ్బరి, ఉప్పు కలిపి పొడి చేసుకోవాలి.

తయారు చేసే విధానం: దోసకాయలు తీసుకొని వాటికి నాలుగు వైపులా గాట్లు పెట్టుకోవాలి (గుత్తి వంకాయలాగా). పైన చెప్పిన మసాలాలన్నీ పొడి చేసి పెట్టుకోవాలి. ఈ మసాలా పొడిని దోసకాయల గాట్లలో కూరి, నూనెలో తాలింపు వేసి, పూర్ణం నింపిన దోసకాయలను ఉడికించాలి. చివరగా కొద్దిగా చింతపండు రసం లేదా బెల్లం జోడిస్తే రుచి అద్భుతంగా ఉంటుంది. దీనిని అన్నం, చపాతీతో పాటు తింటే ఎంతో రుచిగా ఉంటుంది.

కుండను ఇలా ఉపయోగిస్తే.. ఇక తిరుగుండదు!



ఎండలు మండిపోతున్నాయి. ఎండల్లో చల్లని నీరు తాగడానికి చాలామంది కుండలు వాడుతుంటారు. ఫ్రిజ్ నీళ్ల కంటే కుండ నీళ్లు ఆరోగ్యానికి మంచివి. అయితే కుండను సరిగ్గా నిర్వహించుకోకపోతే అనారోగ్యాల బారిన పడే ప్రమాదముంది. అందుకే కుండను ఎలా శుభ్రంగా ఉంచుకోవాలో తప్పక తెలుసుకోవాలి.నిర్మాణపరంగా కుండ సన్నని రంధ్రాలతో తయారుచేసి ఉంటుంది. ఈ రంధ్రాలే ఎండ వేడి నుండి నీళ్లను చల్లగా ఉంచుతాయి. అయితే ఈ నీళ్లు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. కొత్త కుండను వాడేవాళ్లు ముందుగా దాన్ని నీళ్లల్లో నానబెట్టాలి. ఒక రోజంతా అలాగే ఉంచాలి. ఇలా చేస్తే మట్టి వాసన కూడా రాదు. నానబెట్టిన కుండను ఏదేని డిష్‌వాష్ స్క్రబర్‌తో శుభ్రంగా తోమాలి. ఆ తరువాత ఎండలో పెట్టాలి.

ప్రతి రోజూ ..

చాలామంది చేసే తప్పు ఏంటంటే కుండను ప్రతి రోజూ శుభ్రం చేయరు. అందులోనే మళ్లీ మళ్లీ నీళ్లు నింపుతుంటారు. ఇలా చేయడం వల్ల ఎండ వేడికి ఆ నీళ్లల్లో బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. దుమ్ము, ధూళి కణాలు కూడా చేరతాయి. ఇలాంటి కుండలో నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి ప్రతిరోజూ కుండను శుభ్రం చేయాలి.

సబ్బుతో వద్దు ..

కుండను సబ్బు, సర్ఫు లాంటి డిటర్జెంట్లతో శుభ్రం చేయకూడదు. కుండలో ఉండే రంధ్రాల్లో వీటి అవశేషాలు అలానే ఉండిపోయి నీళ్ల రుచి మారిపోతుంది. అలా కాకుండా సహజసిద్ధంగా శుభ్రం చేసుకోవాలి. ఉప్పు, బేకింగ్ సోడాతో శుభ్రం చేయడం వల్ల బ్యాక్టీరియా నశిస్తుంది. అలాగే నెలకు ఒకసారి వెనిగర్‌తో శుభ్రం చేసుకోవాలి.

రాత్రి పూట త్వరగా భోజనం చేస్తే కలిగే అద్భుతమైన లాభాలు



శరీరంలో నిజంగా ఏం జరుగుతుందో ఎప్పుడైనా ఆలోచించారా? చాలా మంది ఇది కేవలం ఆకలి తగ్గడానికే సహాయపడుతుందని భావిస్తారు. కానీ శరీరంలో జరిగే మార్పులు అంతకంటే చాలా పెద్దవిగా ఉంటాయి. । రాత్రి పూట త్వరగా భోజనం చేస్తే శరీరంలో నిజంగా ఏం జరుగుతుందో ఎప్పుడైనా ఆలోచించారా? చాలా మంది ఇది కేవలం ఆకలి తగ్గడానికే సహాయపడుతుందని భావిస్తారు. కానీ శరీరంలో జరిగే మార్పులు అంతకంటే చాలా పెద్దవిగా ఉంటాయి. నిద్రకు ముందు పొట్టకు సరైన విశ్రాంతి ఇచ్చినప్పుడు, శరీరం జీర్ణక్రియపై కాకుండా రిపేర్ (పునరుద్ధరణ) పనులపై దృష్టి పెడుతుంది. దీని వల్ల గట్ (జీర్ణ వ్యవస్థ) రిథమ్ నుంచి నిద్ర ప్యాటర్న్స్ వరకు అనేక మార్పులు జరుగుతాయి. రాత్రిపూట త్వరగా తినడం వల్ల శరీరంలో జరిగే మార్పుల గురించి వైద్యులు వివరిస్తున్నారు. మొదటగా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రాత్రి ఆలస్యంగా తినడం వల్ల జీర్ణవ్యవస్థ విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో కూడా పని చేస్తూనే ఉంటుంది. బ్రిటిష్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం, రాత్రి భోజనం ఆలస్యంగా చేయడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది, ఆమ్లత్వం (ఆసిడిటీ) పెరుగుతుంది.త్వరగా భోజనంసులభంగా బరువు తగ్గవచ్చు..అయితే త్వరగాఆ భోజనం చేస్తే గట్ ఒక నియమిత రిథమ్‌కి అలవాటు పడుతుంది. దీంతో ఉబ్బరం, జీర్ణ సమస్యలు తగ్గుతాయి. అలాగే నిద్ర నాణ్యత సహజంగా మెరుగవుతుంది. రాత్రి ఆలస్యంగా తినడం వల్ల శరీరం యాక్టివ్‌గా పనిచేయాల్సి వస్తుంది. హార్ట్ రేట్, శరీర ఉష్ణోగ్రత పెరుగుతాయి. దీంతో నిద్రపోవడం కష్టమవుతుంది. జర్నల్ ఆఫ్ క్లినికల్ స్లీప్ మెడిసిన్ ప్రకారం, నిద్రకు ముందు భోజనానికి కనీసం 2-3 గంటలు వ్యవధి ఉండాలి. దీని వల్ల రాత్రి మధ్యలో లేవడం తగ్గుతుంది. మూడు నెలల్లో ఇది సహజ నిద్ర చక్రాన్ని బలోపేతం చేస్తుంది.అదే విధంగా ఆకలి హార్మోన్లు సమతుల్యం అవుతాయి. రాత్రి ఆలస్యంగా తినడం వల్ల గ్రెలిన్, లెప్టిన్ అనే ఆకలి నియంత్రణ హార్మోన్లు అసమతుల్యం అవుతాయి. హార్వర్డ్ మెడికల్ స్కూల్ అధ్యయనం ప్రకారం, రాత్రి ఆలస్యంగా తినడం వల్ల మరుసటి రోజు ఎక్కువ ఆకలి వేస్తుంది. అయితే రాత్రిపూట త్వరగా తింటే హార్మోన్లు మళ్లీ సహజ స్థితికి వస్తాయి, అనవసరంగా తినాలనిపించడం తగ్గుతుంది. అంతేకాకుండా బరువు, మెటబాలిజం మెరుగవుతాయి. రాత్రి ఆలస్యంగా తినడం వల్ల అదనపు కాలరీలు శరీరంలో చేరుతాయి.రాత్రిపూట అలవాట్లుదయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు..రాత్రి పూట త్వరగా భోజనం చేస్తే రక్తంలో చక్కెర స్థాయిలు మెరుగుపడతాయి, శరీరం నిల్వ ఉన్న ఎనర్జీని సరిగ్గా వినియోగించుకోవడం మొదలుపెడుతుంది. కొందరికి ప్రత్యేకంగా డైట్ చేయకపోయినా క్రమంగా బరువు తగ్గడం కనిపిస్తుంది. అలాగే గట్ మైక్రోబయోమ్ (మంచి బ్యాక్టీరియా) మెరుగవుతుంది. రాత్రి ఆలస్యంగా తింటే గట్‌లోని మంచి బ్యాక్టీరియా సమతుల్యాన్ని దెబ్బతీస్తుంది. రాత్రి విరామం ఇవ్వడం వల్ల ఈ బ్యాక్టీరియా పునరుద్ధరణకు సమయం దొరుకుతుంది. దీంతో జీర్ణక్రియ మెరుగవడం, ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గడం, ఇమ్యూనిటీ బలపడడం జరుగుతుంది. మల విసర్జన క్రమబద్ధంగా మారుతుంది. వీటితో పాటు ఆసిడ్ రిఫ్లక్స్ తగ్గుతుంది. రాత్రి తిన్న వెంటనే పడుకోవడం వల్ల గుండెల్లో మంట (ఆసిడ్ రిఫ్లక్స్) ఎక్కువగా ఉంటుంది. అయితే త్వరగా భోజనం చేస్తే జీర్ణవ్యవస్థపై ఒత్తిడి తగ్గి ఈ సమస్యలు క్రమంగా తగ్గుతాయి. అయితే రాత్రి భోజనం త్వరగా చేయడం వల్ల లాభాలు చాలా త్వరగా ప్రారంభమై క్రమంగా పెరుగుతాయి. చిన్న అలవాటు మార్పు కూడా శరీర ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపగలదని నిపుణులు తెలియజేస్తున్నారు.

బ్యాక్ టు బ్యాక్ ఐపీఎల్ ట్రోఫీలు గెలిచిన జట్లు ఇవే.. ధోని, రోహిత్ క్లబ్‌లో ఆర్‌సీబీ చేరేనా?




హైదరాబాద్ పెన్ పవర్: ఐపీఎల్ 2026 ఆఖరి అంకానికి వచ్చేసింది భయ్యా. రెండు నెలల సంబురానికి రేపటితో ఎండ్ కార్డు పడబోతుంది. మే 31 (ఆదివారం) నాడు అహ్మదాబాద్ నరేంద్ర మోడీ స్టేడియంలో రజత్ పాటిదార్ నాయకత్వంలోని ఆర్‌సీబీ, శుభ్‌మన్ గిల్ సారథ్యంలో గుజరాత్ టైటాన్స్ ట్రోఫీ కోసం గట్టిగ కుస్తీ పడబోతున్నాయి. క్వాలిఫయర్-1లో గుజరాత్‌ని ఘోరంగా ఓడించి ఫైనల్ కి బెంగళూరు చేరింది. ఒకవేళ రేపు గనుక మ్యాచ్ గెలిస్తే ఆర్‌సీబీ పోరగాళ్లు హిస్టరీ క్రియేట్ చేస్తారు. వరుసగా రెండో ఏడాది కప్పు కొట్టి, ఐపీఎల్ చరిత్రలోనే ఒక కిర్రాక్ రికార్డును పైసా వసూల్ రేంజ్ లో సొంతం చేసుకునే గోల్డెన్ ఛాన్స్ పాటిదార్ సేన ముందుంది.

ధోని, రోహిత్ ఎలైట్ క్లబ్‌లో పాటిదార్ చేరేనా?:

ఐపీఎల్ చరిత్రలో వరుసగా రెండు సార్లు కప్ కొట్టి టైటిల్‌ను డిఫెండ్ చేసుకున్న రికార్డు కేవలం రెండు జట్లకు మాత్రమే ఉంది. ఒకవేళ ఆర్‌సీబీ గనుక రేపు గెలిస్తే, రజత్ పాటిదార్ నేరుగా మహేంద్ర సింగ్ ధోని, రోహిత్ శర్మల పక్కన కుర్చీ వేసుకుని కూర్చునే అవకాశం దక్కుతుంది.

18 ఏండ్ల కల నెరవేరింది:

2025లో 18 ఏండ్ల శాపాన్ని బద్దలు కొట్టి ఫస్ట్ టైటిల్ ముద్దాడిన ఆర్‌సీబీ.. ఈసారి కూడా అదే ఊపులో ఉంది. మరి ధోని, రోహిత్ ల తర్వాత వరుసగా రెండోసారి ఐపీఎల్ సామ్రాజ్యాన్ని ఏలబోయే ఆ మూడో కెప్టెన్‌గా పాటిదార్ నిలుస్తాడా లేదా అనేది రేపు రాత్రికి తేలిపోతది.

లాస్ట్ బాల్ థ్రిల్లర్ రివెంజ్?:

మరోవైపు శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని గుజరాత్ టైటాన్స్ ఊరికే వదిలేలా లేదు.. వాళ్ళ హోమ్ గ్రౌండ్‌లో మ్యాచ్ కాబట్టి మస్తు కాన్ఫిడెన్స్‌తో ఉంటారు. 2022లో ఐపీఎల్‌లోకొచ్చిన డెబ్యూ సీజన్ లోనే కప్పు కొట్టి రచ్చ లేపిన గుజరాత్, 2023లో కూడా వరుసగా రెండోసారి కప్ కొట్టేలా కనిపించింది. కానీ ఆ ఫైనల్లో సీఎస్‌కే చేతిలో లాస్ట్ బాల్ థ్రిల్లర్‌లో ఓడిపోయింది.

కసితో రగిలిపోతున్న గిల్ సేన:

మళ్లీ మూడేండ్ల తర్వాత గుజరాత్ టైటాన్స్ ఫైనల్స్ లో అడుగు పెట్టింది. ఐదు సీజన్లలో వీరికి ఇది మూడో ఫైనల్ మ్యాచ్ కావడం విశేషం. క్వాలిఫయర్-1 లో ఆర్‌సీబీ చేతిలో ఓడిపోయినప్పటికీ, క్వాలిఫయర్-2లో రాజస్థాన్‌ను ఓడించి, మళ్లీ గిల్ సేన ఫైనల్ లోకి ఎంట్రీ ఇచ్చింది. కాబట్టి తమ సొంత స్టేడియంలో ఆర్‌సీబీని బోల్తా కొట్టించాలని గుజరాత్ టైటాన్స్ జట్టు కసితో ఉంది.

ఐపీఎల్ ఫైనల్స్‌లో కింగ్ కోహ్లీ రికార్డు ఇదే.. గుజరాత్‌తో ఫైట్‌కు ముందు విరాట్ హిస్టరీ డీకోడ్!

హైదరాబాద్ పెన్ పవర్: అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఐపీఎల్ 2026 ఫైనల్ కి కౌంట్‌డౌన్ స్టార్ట్ అయింది. రజత్ పాటిదార్ కెప్టెన్సీలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి ఫైనల్‌లోకి దూసుకెళ్లి హిస్టరీ క్రియేట్ చేయడానికి సిద్ధమైంది. డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా బరిలోకి దిగుతున్న ఆర్‌సీబీ ఆశలన్నీ ఎప్పటిలాగే కింగ్ విరాట్ కోహ్లీపైనే ఉన్నాయి. మరి ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు ఐపీఎల్ ఫైనల్స్ ప్రెజర్‌లో కోహ్లీ ట్రాక్ రికార్డ్ ఎలా ఉందో ఇప్పుడు తెలుసుకుందాం..

కోహ్లీ ఐపీఎల్ ఫైనల్స్ జర్నీ:

కోహ్లీ ఇప్పటి వరకు ఆడిన 4 ఐపీఎల్ ఫైనల్స్ మ్యాచ్‌లలో 34.75 సగటుతో మొత్తం 139 రన్స్ మాత్రమే చేశాడు. కెరీర్ మొదటి పదేళ్లలో ఫైనల్స్ అంటే కోహ్లీకి కేవలం గుండెకోత మాత్రమే మిగిలింది. కానీ గత ఏడాది (2025) జరిగిన ఫైనల్ మ్యాచ్ అతని తలరాతను పూర్తిగా మార్చేసింది.

ఫైనల్స్‌లో కోహ్లీ రికార్డు:

2009 (ఆర్‌సీబీ vs డెక్కన్ చార్జర్స్): అప్పట్లో కోహ్లీ కేవలం ఒక టీనేజ్ బ్యాటింగ్ సెన్సేషన్ మాత్రమే.. ఆ ఫైనల్‌లో ఆర్‌సీబీ చేతుల్లో ఉన్న మ్యాచ్‌ను చేజార్చుకుని రన్నరప్‌గా నిలిచింది.

2011 (ఆర్‌సీబీ vs చెన్నై సూపర్ కింగ్స్): సీఎస్‌కే విధించిన భారీ టార్గెట్ ఛేజింగ్‌లో కోహ్లీ 35 పరుగులతో పోరాట పటిమ చూపించినా.. లాభం లేకుండా పోయింది. చెన్నై ఘన విజయం సాధించింది.

2012--2016 (ఆర్‌సీబీ vs సన్‌రైజర్స్ హైదరాబాద్): 2016 ఫైనల్‌లో కోహ్లీ చెలరేగి ఆడి 35 బంతుల్లో 54 పరుగులు సాధించాడు. కానీ, డేవిడ్ వార్నర్ ఆర్మీ ఆర్‌సీబీ కప్ చెదరగొట్టింది.

2025 (ఆర్‌సీబీ vs పంజాబ్ కింగ్స్): గత ఏడాది ఫైనల్‌లో కోహ్లీ పరుగులు చేయడానికి కాస్త ఇబ్బంది పడ్డాడు. 35 బంతుల్లో 43 రన్స్ నెమ్మదైన ఇన్నింగ్స్ ఆడాడు. అయితే మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు, అలాగే బౌలింగ్‌లో భువనేశ్వర్ కుమార్, యష్ దయాల్, కృనాల్ పాండ్యా మ్యాజిక్ చేయడంతో ఆర్‌సీబీ ఎట్టకేలకు తమ ఫస్ట్ ఐపీఎల్ ట్రోఫీని దక్కించుకుంది.

ఫైనల్ లో ప్రెజర్లో కోహ్లీ నిజమేనా?:



ఐపీఎల్ హిస్టరీలోనే కోహ్లీ పరుగుల రారాజు అనడంలో ఎలాంటి సందేహం లేదు.. కానీ, నార్మల్ మ్యాచ్‌లతో పోలిస్తే ఫైనల్స్‌లో అతని అగ్రెసివ్ నెస్, కన్సిస్టెన్సీ కొంచెం తగ్గినట్లు పలు గణాంకాలు చెప్తున్నాయి.

ఓవరాల్ కెరీర్‌లో 134o స్ట్రైక్ రేట్ ఉన్న కోహ్లీ.. ఫైనల్స్ మ్యాచ్‌లకు వచ్చేసరికి 126.36 స్ట్రైక్ రేట్‌తో కాస్త నెమ్మదించాడు. ఘగత ఏడాది ఫైనల్స్ (2025) లో కూడా ఫ్లాట్ పిచ్‌పై విరాట్ కోహ్లీ 35 బంతుల్లో 43 రన్స్ చేయడమే దీనికి ఉదాహరణ.

ఫైనల్ గేమ్ చేంజర్:

ఫైనల్స్ రికార్డ్స్ ఎలా ఉన్నా.. ఈసారి గుజరాత్ టైటాన్స్‌తో జరిగే మ్యాచ్‌లో కోహ్లీనే ఆర్‌సీబీకి లార్జర్- దన్ -లైఫ్ వెపన్. ఎందుకంటే గుజరాత్ టీమ్‌లో కగిసో రబాడ, మహమ్మద్ సిరాజ్ వంటి స్పీడ్‌తో భయపెట్టే 'రా పేస్' బౌలర్లు ఉన్నారు. కానీ కోహ్లీకి ఇలాంటి ఎక్స్‌ప్రెస్ పేస్‌ను ఎదుర్కోవడం వెన్నతో పెట్టిన విద్య.. ఈ ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్‌పై కోహ్లీ ట్రాక్ రికార్డ్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. ఈ సీజన్‌లో గుజరాత్‌తో జరిగిన 3 మ్యాచ్‌ల్లో కోహ్లీ ఏకంగా 82 బంతుల్లో 152 రన్స్ కొట్టాడు. రబడా, సిరాజ్ వేసే పవర్‌ప్లే ఓవర్లలోని స్పీడ్‌ను కోహ్లీ గనుక ఈజీగా న్యూట్రలైజ్ చేస్తే.. అహ్మదాబాద్ గ్రౌండ్‌లో పరుగుల వరద పారడం ఖాయం.

టీమిండియా నుంచి గిల్, సూర్య ఔట్.. వైభవ్ కి రెడ్ కార్పెట్




హైదరాబాద్ పెన్ పవర్: ఐపీఎల్-2026 సీజన్ తుది దశకు చేరుకోవడంతో ఇప్పుడు అందరి దృష్టి భారత జట్టు పర్యటనలపై పడింది. ఈ ఏడాది ఐపీఎల్ ముగిసిన తర్వాత టీమిండియా వరుస సిరీస్ లతో బిజీబిజీగా గడపనుంది. మొదట స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్ తో ఒక టెస్ట్, 3 వన్డేల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత ఐర్లాండ్, ఇంగ్లాండ్, జింబాబ్వేలలో ఇండియన్ టీమ్ పర్యటించ నుంది. ఈ ఏడాది భారత జట్టుకి అత్యంత కీలకమైన టోర్నమెంట్లలో ఏషియన్ గేమ్స్ (Asian Games) ఒకటి.. ఈ ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్ వేదికగా కొనసాగనున్నాయి. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్ కోసం 30 మంది ప్లేయర్స్ తో కూడిన ప్రాబబుల్స్ జాబితాను బీసీసీఐ సెలక్షన్ కమిటీ రెడీ చేసినట్లు టాక్. లిస్టులో టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, టెస్ట్, వన్డే సారథి శుభ్ మన్ గిల్ కి స్థానం దక్కకపోవచ్చనే టాక్ వినిపిస్తుంది. ఐపీఎల్ 2026లో దుమ్ములేపిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని బీసీసీఐ షార్ట్ లిస్ట్ చేసినట్లు తెలుస్తుంది. వైభవ్ తో పాటు జైస్వాల్, శాంసన్, ఇషాన్, అభిషేక్, బుమ్రా, హార్దిక్, శ్రేయస్, నితీశ్, అక్షర్ వంటి స్టార్ క్రికెటర్లు కూడా ఈ ఏడాది ఆసియా గేమ్స్ ఆడనున్నట్లు తెలుస్తుంది. కాగా ఈ 30 మంది లిస్టు నుంచే 15 మంది సభ్యుల జట్టును సెలక్ట్ చేయబోతున్నట్లు సమాచారం. ఈ ఆసియా క్రీడల కోసం జట్టుని ప్రకటించేందుకు జూన్ 10 చివరి తేదీగా ఫిక్స్ చేసినట్లు టాక్. ఈ టోర్నీ సమయంలోనే టీమిండియా సీనియర్ టీమ్ వెస్టిండీస్ పర్యటనకి వెళ్లనుంది. ఈ టూర్ లో భాగంగా ఆతిథ్య విండీస్ తో 5 టీ20లు, 3 వన్డేలని భారత్ ఆడనుంది. సెప్టెంబర్ 27న ఇండియా-- విండీస్ పర్యటన స్టార్ట్ అవుతుంది. తొలుత వన్డే సిరీస్ జరిగిన తర్వాత అక్టోబర్ 6 నుంచి టీ20 మ్యాచులు జరుగుతాయి. ఈ సిరీస్ సమయానికి అభిషేక్ శర్మ, సంజు శాంసన్ లాంటి స్టార్ ఆటగాళ్లు ఏషియన్ గేమ్స్ ముగించుకుని జట్టుతో చేరే ఛాన్స్ ఉంది.

చేపల మార్కెట్‌కి వెళ్లి మాకు నచ్చే చేపలు కొని తెచ్చేది!- జాన్వీ



మీనాక్షి చౌదరి క్లాసిక్ చీర లుక్‌లో టైమ్‌లెస్ గాంభీర్యాన్ని ప్రసరిస్తుంది





గోల్డెన్ గౌన్ బీచ్ ఫోటోషూట్‌లో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ స్టన్స్

భారతీయ సినీపరిశ్రమలో తనదైన అద్భుత నటన, గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ కిడ్ జాన్వీ కపూర్ తాజాగా తన తల్లి, దివంగత నటి శ్రీదేవి గురించి సంచలన విషయాలను షేర్ చేసారు. ప్రస్తుతం టాలీవుడ్ - బాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న జాన్వీ ఒక ఇంటర్వ్యూలో తన తల్లి వారసత్వాన్ని మోయడంపై మనసు విప్పారు. సినిమా ఇండస్ట్రీలో అడుగుపెట్టినప్పటి నుండి తన తల్లి ఇమేజ్‌తో ఎదురవుతున్న పోలికలు, తన వ్యక్తిగత ఎదుగుదల.. మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ సరసన -పెద్ది- వంటి భారీ చిత్రాలలో నటిస్తున్న తరుణంలో తన ఆలోచనా విధానం ఎలా ఉందో జాన్వీ ఈ ఇంటర్వ్యూలో వెల్లడించారు. చిన్నతనంలో తన తల్లి శ్రీదేవి ఎంతటి పెద్ద సూపర్‌స్టారో.. దేశవ్యాప్తంగా మామ్‌కు ఎంతటి క్రేజ్ ఉందో తనకు అస్సలు తెలిసేది కాదని జాన్వీ కపూర్ చెప్పారు. తాము ఎంత పెద్ద స్టార్ ఫ్యామిలీకి చెందినవారమైనా ఇంట్లో మాత్రం సినిమా వాతావరణాన్ని తల్లి ఎప్పుడూ దూరంగానే ఉంచేదని.. ఒక సాధారణ తల్లిలాగే తమను చూసుకునేదని వెల్లడించారు. మాకు అమ్మ సూపర్‌వుమన్ ఎందుకు అంటే.. ప్రతి శుక్రవారం ఫిష్ మార్కెట్‌కు వెళ్లి వంటకు ఏ రకం ఫిష్ బాగుంటుందో స్వయంగా ఎంపిక చేసి తీసుకురావడం. ఆ పనులన్నీ చేయడంలో అమ్మ ఎంతో గర్వంగా, సంతోషంగా ఫీల్ అయ్యేది! అని జాన్వీ తన చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తాను స్వయంగా నటనా రంగంలో అడుగుపెట్టి నటిగా పని చేయడం ప్రారంభించాకనే.. అసలు తన తల్లి ప్రేక్షకులకు ఎంతటి ఆరాధ్య దైవమో.. వారి జీవితాల్లో ఎంతటి ప్రాధాన్యత కలిగి ఉందో పూర్తిగా అర్థం కావడం ప్రారంభమైందని జాన్వీ అన్నారు. వెండితెరపైనే కాకుండా.. సాధారణ ప్రజల మనసుల్లో శ్రీదేవి పై ఉన్న అపారమైన ప్రేమాభిమానాల గురించి తెలుసుకోవడం ఒక గొప్ప బ్లెస్సింగ్‌గా భావిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి అపారమైన ప్రజాదరణ తరాలకోసారి.. ఎప్పుడో ఒకసారి మాత్రమే సాధ్యమవుతుందని.. తన తల్లి సృష్టించిన ఆ మ్యాజిక్‌ను మళ్లీ రీ-క్రియేట్ చేయడం ఎవరికైనా దాదాపు అసాధ్యమని జాన్వీ స్పష్టం చేశారు. సినిమా రంగంలో తనను నిరంతరం తల్లి శ్రీదేవితో పోల్చడంపై జాన్వీ కపూర్ ఎంతో మెచ్యూర్డ్‌గా సానుకూల దృక్పథంతో స్పందించారు. చిత్ర పరిశ్రమలో ఎవరినో ఒకరితో పోల్చడం చాలా సహజమైన విషయమేనని జాన్వీ పేర్కొన్నారు. నన్ను భారతీయ చలనచిత్ర చరిత్రలోనే ఆల్ టైమ్ గ్రేటెస్ట్ యాక్ట్రెస్‌తో పోలుస్తున్నప్పుడు.. నేను దానిని ఒక అదృష్టంగా భావిస్తాను. ఆ పోలికలు నన్ను మరింత కష్టపడటానికి నా నటనను ప్రతి సినిమాకు మెరుగుపరుచుకోవడానికి ఒక గొప్ప ఎనర్జీని, మోటివేషన్‌ను ఇస్తాయి తప్ప అందులో ఎలాంటి నెగిటివిటీ లేదు! అని జాన్వీ చాలా స్పష్టంగా వివరించారు. ప్రస్తుతం తాను ఏ సినిమా చేసినా పూర్తి స్థాయి నిజాయితీతో చేస్తున్నానని.. నటిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. స్టార్ కిడ్ అనే ట్యాగ్ ..శ్రీదేవి ఇమేజ్ తెచ్చే ఒత్తిడిని నెగిటివ్‌గా తీసుకోకుండా తన కెరీర్‌కు అదొక ఇంధనంగా మార్చుకున్నానని జాన్వీ కపూర్ చెప్పిన విధానం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. టాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ, మునుముందు నటిగా మరిన్ని శిఖరాలను అందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. చరణ్- జాన్వీ జంటగా నటించిన పెద్ద జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965